
నక్షత్ర పబ్లికేషన్స్
SIRA VELUGU
# సిరా వెలుగు



తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ గురువారం 05-01-2023 సంపుటి : 13 సంచిక : 29 వెల : 5/- పేజీలు 8

## సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ భేటీ



**హైదరాబాద్ :** భారత రాష్ట్ర సమితి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తోట చంద్రశేఖర్ బుధవారం ప్రగతి భవన్‌లో ఆ పార్టీ అధినేత సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పటిష్టతతో పాటు తదితర అంశాలపై చర్చించారు. తనను ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా నియమించినందుకు మరోసారి సీఎం కేసీఆర్‌కు తోట చంద్రశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఏపీ నేత చింతల పార్థసారథి తదితరులున్నారు. ఏపీకి చెందిన మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, మాజీ ఐఏఎస్ తోట చంద్రశేఖర్, మాజీ ఐఆర్ఎస్ చింతల పార్థసారథి.. ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ఈ నెల 2వ తేదీన భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు మిగతా 2లో

## అధికారులు ఓనర్‌షిప్ తీసుకోవాలి



**తాడేపల్లి:** అధికారులు ఓనర్‌షిప్ తీసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాలు సమర్థవంతంగా పనిచేయాలి.. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. బుధవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైయస్ జగన్ సమీక్ష నిర్వహించారు. సచివాలయాల్లో మెరుగైన పనితీరు, సమగ్ర పర్యవేక్షణ, సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో సచివాలయాల కీలక పాత్ర, సచివాలయాల్లో ఏర్పడ్డ ఖాళీల భర్తీ తదితర అంశాలపై సీఎం సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం ఏమన్నారంటే... పరిపాలనలో విప్లవాత్మక మార్పుగా గ్రామ, ఎర్డు సచివాయాలను ఏర్పాటు చేశాం. చివరి స్థాయి వరకూ సమర్థవంతమైన డెలివరీ మెకానిజమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు మిగతా 2లో

## గంగారామ్ హాస్పిటల్‌లో చేరిన సోనియా గాంధీ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత్రి సోనియా గాంధీ ఇవాళ గంగా రామ్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. రొటీన్ చెకప్ కోసం ఆమె హాస్పిటల్ వెళ్లినట్లు తెలుస్తోంది. సోనియా కూతురు ప్రియాంకా గాంధీ వద్రా కూడా ఆమెతో ఉన్నారు. శ్వాసకోస ఇన్‌ఫెక్షన్‌తో సోనియా బాధపడుతున్నట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. మంగళవారం నుంచి సోనియా ఆరోగ్యం క్షీణించినట్లు సమాచారం ఉంది. దాని వల్లే జోడో యాత్ర మధ్యలో నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంకాలు.. ఢిల్లీకి వచ్చినట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్ర ప్రస్తుతం యూపీలోకి ఎంటరైన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అగ్నివీర్ ప్రక్రియ రద్దు

### జోడో యాత్రలో రాహుల్ వెల్లడి

**ఉత్తరప్రదేశ్:** కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్నివీర్ ప్రక్రియను రద్దు చేయనున్నట్లు కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాత విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అగ్నివీర్ కారణంగా సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని ఆశగా ఎదురు ఎందరో యువకులు నిరుత్సాహానికి గురయ్యారన్నారు. ఇలాంటి యువతను దృష్టిలో ఉంచుకుని అగ్నివీర్‌ను పూర్తిగా రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్‌లో కొనసాగుతున్నది. ఉదయం 6.15 గంటలకు మావి కలన్ నుంచి జోడో యాత్రను రాహుల్ ప్రారంభించారు. సిసానా సమీపంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు సంబంధించిన దేవీలాల్ చౌదరి సహా ఐదుగురు యువకులు రాహుల్‌తో దాదాపు 25 నిమిషాల పాటు సంభాషించారు. తాను అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో తాను ఎంపికయ్యానని, అయితే ఎలాంటి కారణం లేకుండా రిక్రూట్‌మెంట్‌ను నిలుపుదల చేశారని రాహుల్ గాంధీ దృష్టికి దేవీలాల్ చైదరి తీసుకొచ్చాడు. అగ్నివీర్ కారణంగా నాలాంటి ఎందరో యువకులు ఎంపికైనప్పటికీ సైన్యంలో చేరలేకపోయారని చెప్పాడు. దీనిపై రాహుల్ కాస్తా తీవ్రంగా స్పందిస్తూ..



కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాగానే అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను రద్దు చేస్తుందని.. పాత విధానంలోనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ జరుపుతామని యువకులకు హామీ ఇచ్చాడు.భారత్ జోడో యాత్రలో రాలోడ్, పీస్ పార్టీ, భీమ్ ఆర్మీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాగ్‌పట్ జిల్లాకు చెందిన దాదాపు 200 మంది భీమ్ ఆర్మీ కార్యకర్తలు రాహుల్ వెంట నడిచారు. షామ్లీలోని యూపీ సరిహద్దు వరకు నడవనున్నట్లు వారు తెలిపారు.

## బండి సంజయ్ ఔట్.? తెలంగాణ బీజేపీ చీఫ్‌గా ఈటల?



4

## తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జ్‌గా మాణిక్‌రావ్ ఠాక్రే



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కొత్త ఇన్‌ఛార్జ్‌గా మాణిక్‌రావ్ ఠాక్రే నియామకం అయ్యారు. ఈ మేరకు అదిష్టానం ప్రకటన చేసింది. ఇప్పటివరకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మాణిక్కం ఠాగూర్ ను హైకమాండ్ గోవా కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. 1954 లో మహారాష్ట్రలో జన్మించిన మాణిక్‌రావ్ ఠాక్రే 1985 నుంచి 2004 వరకు 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 3 సార్లు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2008 నుంచి 15 వరకు మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాకుండా వ్యవసాయ గ్రామీణాభివృద్ధి, హోం శాఖ , విద్యుత్ శాఖ మంత్రిగా కూడా పనిచేశారు.

## పాక్ పొదుపు మంత్రం.. విద్యుత్ వినియోగంపై కీలక నిర్ణయం

2లో

## బాబు పర్యటనకు బ్రేక్.. అనుమతించని అధికారులు

3లో

## వేడెక్కిన యూరోప్.. జనవరిలో వింటర్ హీట్

4లో

## ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం సిద్ధం : మంత్రి హరీశ్‌రావు



2

## విద్యుత్ ప్రైవేటీకరణపై మరో పోరాటానికి సిద్ధం కావాలి : మంత్రి జగదీష్‌రెడ్డి

# కాంగ్రెస్ ధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్ :** కాంగ్రెస్ ధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సర్పంచుల సమస్యలపై కాంగ్రెస్ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఆ పార్టీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ధర్నాకు అనుమతినిచ్చింది. ధర్నాలో 300 మందికి మించి ఉండకూడదని తెలిపింది. ధర్నాలో ఎలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని హైకోర్టు స్పష్టం చేసింది. మళ్ళీ సభ ఎప్పుడు నిర్వహిస్తున్నారో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించింది.
సర్పంచుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునివ్వగా..పోలీసులు ఆ పార్టీ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ధర్నాకు అనుమతిలేదంటూ రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారు. అయితే పోలీసుల తీరుపై రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంటికి వచ్చి అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. తన పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా తాను తిరగొద్దా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ధర్నా చౌక్ కు పోతున్నానని ఎవరు చెప్పారన్న రేవం

# అధికారులు ఓనర్‌షిప్ తీసుకోవాలి

చేశాం. ఇలాంటి వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలి. సరైన ఎస్‌ఓపీలు, పర్యవేక్షణ లేకపోతే ప్రయోజనం ఉండదు.
సిబ్బంది హాజరు దగ్గరనుంచి అన్నిరకాలుగా పర్యవేక్షణ ఉండాలి.
గ్రామ, వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటలనుంచి 5 గంటలవరకూ స్పందన నిర్వహించాలి. ప్రభుత్వ విభాగాల వారీగా మండలాల స్థాయిలో పర్యవేక్షణ ఉండాలి. రిపోర్టింగ్ స్ట్రక్చర్ పటిష్టంగా ఉండాలి. గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిపై విభాగాల వారీగా మండల స్థాయిలో పర్యవేక్షణ ఉండాలి. విధులు, బాధ్యతలపై ఎస్‌ఓపీలు ఉండాలి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. అర్జీల పరిష్కారం కూడా చాలా ముఖ్యమైనది. వాటి పరిష్కారంలో నాణ్యత ఉండాలి. ఒకే అర్జీ మళ్లీ వచ్చినప్పుడు మళ్లీ అదే వ్యవస్థ దాన్ని పరిశీలించే బదులు, ఆ పై వ్యవస్థ పరిశీలన చేసి ఆ అర్జీని పరిష్కరించాలి.
రీ వెరిఫికేషన్ కోసం పై వ్యవస్థకు వెళ్లడం అన్నడం అన్నది ప్రధానం.
ఈ అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అప్పుడే గ్రామ, వార్డు సచివాలయాలు సమర్థవంతంగా పనిచేయగలుగుతాయి. అధికారులు ఓనర్‌షిప్ తీసుకోవాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. ప్రభుత్వ శాఖాధిపతులు ప్రతి నెల 2 సచివాలయాలను తప్పనిసరిగా సందర్శించాలి. దీనివల్ల వాటి సమర్థత పెరుగుతుంది. సచివాలయా ప్రభుత్వంలో సమర్థవంతమైన ఉద్యోగులు ఉన్నారు. వారి సేవలు ప్రజలకు అందాలి. అప్పుడే ప్రజలకు అన్నిరకాలుగా ఉపయోగం, అనుకున్న లక్ష్యాలను కూడా సాధించగలుగుతాం. సిబ్బందితో మంచి సమన్వయం కోసం, వారు అందుబాటులో ఉండేలా మెరుగైన విధానాలను అవలంభించాలి : ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వాడుకోవాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే వీటన్నింటి లక్ష్యం.
అందుకనే ప్రతి ప్రభుత్వ విభాగంలోనూ ఫేషియల్ రికగ్నైజేషన్‌తో కూడిన హాజరును అమలు చేయాలి. ప్రభుత్వ శాఖాధిపతుల నుంచే ఇది అమలు అయితే కింది స్థాయిలో కూడా అందరూ అమలు చేస్తారు. దీనివల్ల సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజల వినతులకు సంబంధించిన పరిష్కారంపై దృష్టిపెడతారు. లేకపోతే అంతిమంగా ఇబ్బందులు పడేది ప్రజలే. సుస్థిర ప్రగతి లక్ష్యాలపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించాలి.
అప్పుడే ఆ లక్ష్యాలను అందుకోగలం. గ్రామస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినప్పుడు సుస్థిర ప్రగతి లక్ష్యాలను అందుకోగలం. లేకపోతే ఆ లక్ష్యాల సాధనలో పురోగతి కనిపించదు. సుస్థిర ప్రగతి లక్ష్యాల్లో దేశంలో ఏపీ నంబర్‌ఒన్‌గా నిలవాలి. అలాగే సచివాలయాల్లో సాంకేతిక పరికరాల విషయంలో ఎలాంటి లోపం ఉండకూదు. టెక్నాలజీ పరంగా, సాంకేతిక పరికరాల పరంగా వారికి లోటు ఉండకూడదు. నిరంతరం టెక్నాలజీని అప్‌డేట్ చేయాలి, వారిని అప్‌డేట్‌గా ఉంచాలి.
గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీల భర్తీకి సీఎం ఆమోదం. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయండి.
గత నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టారని మంచి పేరు వచ్చింది. మళ్లీ ఎలాంటి లోపం లేకుండా సమర్థవంతంగా వీరి నియామక ప్రక్రియను చేపట్టాలి. అన్ని ప్రభుత్వ విభాగాలనుంచి ఖాళీల వివరాలను సేకరిస్తున్నామని సీఎంకు తెలిపిన అధికారులు.
ఈ నెలాఖరు కల్లా రాష్ట్రసచివాలయం నుంచి గ్రామస్థాయి సచివాలయం వరకూ కూడా ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు అమలు చేయాలి. అన్ని గ్రామ సచివాలయాలను వైర్డ్ ఇంటర్నెట్‌తో అనుసంధానం చేయాలని సీఎం ఆదేశాలు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్‌రెడ్డి, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి సాయి ప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, సర్వే సెటిల్మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ఏ ఎండీ ఇంతియాజ్, గ్రామ వార్డు సచివాలయాలశాఖ కమిషనర్ షన్ మోహన్, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ సిరి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం సిద్ధం : మంత్రి హరీశ్‌రావు




హైదరాబాద్ : ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది అని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాలు పట్టుదలకు పోకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పదోన్నతులకు సిద్ధం కావాలని సూచించారు. ఉద్యోగులు సిద్ధమై వస్తే వారంలో పదోన్నతులు ఇచ్చే బాధ్యత మాది అని స్పష్టం చేశారు. ఆర్థికశాఖ నుండి వ్యవసాయ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం ఉంటుందని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. అబిడ్స్ రెడ్డి హాస్టల్‌లో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం, వ్యవసాయ డైరీ, క్యాలెండర్‌ను వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. 2006 నుండి పదహారేళ్లుగా వ్యవసాయ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్నాను. రాష్ట్రం వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ ఉద్యోగుల సలహాలు తీసుకున్నారు. వారి సూచనలు, సలహాల ఆధారంగా వచ్చినవే తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయరంగ పథకాలు అని మంత్రి తెలిపారు. సమైక్య రాష్ట్రంలో ఆఖరున ఉన్న వ్యవసాయ శాఖ తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నదని చెప్పారు. 9 మంది జిల్లా వ్యవసాయ అధికారులున్న చోట 32 మంది జిల్లా వ్యవసాయ అధికారులు పనిచేసేందుకు అవకాశం ఇచ్చింది ముఖ్యమంత్రి కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగ స్వరూపం ఎనిమిదేళ్లలో సంపూర్ణంగా మారిపోయిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 2014లో 68 లక్షల మెట్రిక్ టన్నులున్న వరి ధాన్యం ఉత్పత్తి 2022 నాటికి 2.49 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరిందని గుర్తు చేశారు. ప్రపంచంలో నేరుగా రైతుల ఖాతాల్లోకి నిధులు జమచేస్తున్న ఏకైక పథకం రైతు బంధు .. ఇప్పటి వరకు రూ.65 వేల కోట్లు జమ చేశామని తెలిపారు. కాళేశ్వరంతో బీడు భూములను సస్యశ్యామలం చేశాం. మిషన్ కాకతీయ కింద చెరువులు బాగు చేయడంతో చెరువుల కింద 25 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. భూగర్భ జలాలు తెలంగాణ వ్యాప్తంగా పెరిగాయని తెలిపారు. పంట పొలాలను కాల్చకుండా, కేజీ వీల్స్‌తో రైతులు ట్రాక్టర్లతో రోడ్ల మీదకు రాకుండా, కెమికల్ ఫర్టిలైజర్ తగ్గించేలా, సేంద్రీయ వ్యవసాయం పెంచేలా, పాడి, పశుసంపద పెంచేలా, ఆయిల్ పామ్ ప్రోత్సహించేలా వ్యవసాయ అధికారులు కృషిచేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు.

# విద్యుత్ ప్రైవేటీకరణపై మరో పోరాటానికి సిద్ధం కావాలి : మంత్రి జగదీష్‌రెడ్డి




హనుమకొండ : విద్యుత్ ప్రైవేటీకరణ విషయంలో విద్యుత్తు కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ -1104 క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రితో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణకు ఒప్పుకునేది లేదని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి తెలంగాణ విద్యుత్ కార్మికులే నాయకత్వం వహించాలన్నారు. కేంద్రం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతున్న రాష్ట్రంపై కక్ష పెంచుకుని కుట్రలకు పాల్పడుతోందని మంత్రి ధ్వజమెత్తారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు రూ.12 వేల కోట్లు నిలిపివేయడంతో పాటు, బ్యాంకులకు, ఇతర రుణ సంస్థలకు కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఫోన్లు చేసి అప్పు ఇవ్వకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలక రంగాలైన విద్యుత్, వ్యవసాయాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలపై రైతులు పోరాటం చేయడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని తెలిపారు.
ప్రధాని మోదీ కుడి, ఎడమ భుజాలైన కార్పొరేట్ సంస్థలను ధనవంతులను చేయడానికి విద్యుత్ ప్రైవేటీకరణను వదలి పెట్టడం లేదన్నారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణపై కార్మిక లోకం పోరాటం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ కార్మిక పక్ష పాతి అన్న మంత్రి విద్యుత్ కార్మికుల్లో వెలుగులు నింపిన మహానుభావుడన్నారు. విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ త్వరలో పరిష్కారం అవుతుందని మంత్రి తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సీఎం కేసీఆర్‌కు సంపూర్ణ అవగాహన ఉందని, ఉద్యోగుల సమస్యలు యాజమాన్యానికి, ప్రభుత్వానికి తెలుసన్నారు. వాటిని క్రమంగా పరిష్కరించుకుందామని మంత్రి జగదీష్ రెడ్డి చెప్పారు.

# పాక్ పొదుపు మంత్రం.. విద్యుత్ వినియోగంపై కీలక నిర్ణయం



**పాకిస్థాన్:** దాయాది దేశం పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. ఆర్థిక రంగం కుదేలవడం, నిరుద్యోగం వంటి సమస్యలతో ఉక్కిరిబిక్కిరవుతోంది. దీంతో పొదుపు మంత్రం పాటిస్తూ.. కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా విద్యుత్తు రంగంలో భారీగా పేరుకుపోతున్న రుణాలను తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో విద్యుత్తు వినియోగాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఈ మేరకు దేశంలో విద్యుత్తు వినియోగాన్ని తగ్గించేందుకు కీలక ప్రతిపాదనలను ప్రకటించింది. మార్కెట్లు, షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, పెండ్లి మండపాళ్లు రాత్రిపూట తెరిచి ఉంచడంపై ఆంక్షలు విధించింది. రాత్రి 8:30 గంటలకల్లా షాపింగ్ మాల్స్, రాత్రి పది దాటేలోగా పెండ్లి మండపాలు మూసేయాలని ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ ప్లాన్‌లో భాగంగా పాకిస్థాన్ కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ఆయిల్ పైనా ఆంక్షలు విధించాలని నిర్ణయించింది. మార్కెట్లు, మ్యారేజీ హాళ్లు, షాపింగ్ మాల్స్‌ను రాత్రిపూట త్వరగా మూసేయడం ద్వారా దాదాపు రూ.6 వేల కోట్లు పొదుపు చేయొచ్చని పాకిస్థాన్ రక్షణ శాఖ మంత్రి క్వాజా ఆసిఫ్ పేర్కొన్నారు.

# సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ భేట



టీజే ప్రకాశ్(అనంతపురం), తాడివాక రమేశ్ నాయుడు (కాపునాడు, జాతీయ అధ్యక్షుడు), గిద్దల శ్రీనివాస్ నాయుడు (కాపునాడు, ప్రధాన కార్యదర్శి), రామారావు(ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు) కూడా బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

సిరా వెలుగు
తెలుగు దినపత్రిక
గురువారం 05 జనవరి 2023

## సావిత్రిమాయి జయంతికి

# తెలుగు టీచర్లకు అవార్డులు



**ముంబాయి** ఆధునిక భారతంలో ప్రతి నాగరికునికి ఉచిత, ఉన్నత, వ్యవసాయిక విద్య ఇవ్వాలని బ్రిటీష్ ప్రభుత్వపు హంటర్ కమిషన్ కు నివేదిక సమర్పించిన ఏకైక పూలే దంపతులు. అంతకు ముందే జ్యోతిరావు, సావిత్రిమాయి పూలే, ఫాతిమా షేక్ లు కల్సి పుణెలోని 18 బడులను స్థాపించిన ఘనతవుంది. దేశ తొలి ప్రిన్సిపాల్ సావిత్రిమాయి 192వ జయంతిని పురస్కరించుకుని భివండి ముంబై ఉపాధ్యాయులు ఆదర్శ టీచర్ల అవార్డులతో సన్మానం పొందారు. మంగళవారం సాయంత్రం ఋణానుబంద్ అభియాన్ ఆధ్వర్యంలో దాదర్లోని వన్మాలి హాల్లో 5 ఉర్దు, 8 తెలుగు, హింది, మరాఠీ, విశేష ప్రాచుర్యం పొందిన ముగ్గురికి మొత్తం 30 మందిని ఘనంగా సన్మానించారు. సభకు అతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత సీనియర్ మహిళ జర్నలిస్ట్ రాహి భిడే, బిఎంసి డెప్యూటీ కమిషనర్ చందా జాధవ్, లాయర్ ఆసిమ్ సరోదే ల చేతుల మీదుగా మెమోంటో, సర్టిఫికెట్, పుష్పగుచ్ఛంతో సీనియర్ మోస్ట్ ఇంగ్లీష్ టీచర్ గోగినేని హిమబిందు (ఏఈఎస్ స్కూల్), భారత్ సురాల్కర్, కోట శ్రీనివాస్, కురపాటి నవిత, గుజ్జెటి కవిత, గడ్డం పద్మ, అంబటి అనిషా, గౌనె మాధవి, వల్లకాటి వైశాలి, రింకిదేవి యాదవ్, వినిత హజారే తోసహ రాష్ట్రపతి అవార్డు గ్రహీత నివాస్ శేవాలే, నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ తలారి నవ్య, ఆర్టిస్ట్ విజయ్ కుర్దే లను సత్కరించారు. స్టేజిపై అభియాన్ ఉపాధ్యక్షులు నరేంద్ర పగారే, ప్రధాన కార్యదర్శి ప్రకాష్ పాటిల్ ఉండగా, వ్యాఖ్యాతగా ప్రమోద్ సావంత్, మూల్ నివాసి మాలజీ వ్యవహరించారు. సభను విజయవంతం చేయడానికి సిరిమల్లె శ్రీనివాస్, ప్రకాష్ అస్వేకర్, ప్రదీప్ షిందే, రూపేష్ పురాల్కర్, మనోజ్ సాగ్రే లు ఉన్నారు.

# సీతక్క వారసుడొచ్చాడు..



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ లో నీతికి నిజాయితీకి నిస్వార్థ ప్రజాసేవకు మారు పేరు సీతక్క. అందరిపై ఏదో ఒక ముద్ర వచ్చినా సీతక్క సేవానిరతికి మాత్రం ఇప్పటికీ ప్రశంసలు కురుస్తుంటాయి. ఆమె విప్లవ నేపథ్యంలో.. ప్రజల్లో కలిసిపోయే నైజం.. నిరాడంబరత .. రాజకీయాల్లో వేసిన అడుగులు ఎప్పుడూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. తెలంగాణలో పార్టీలకు అతీతంగా సీతక్క ఎంతో పేరు సంపాదించారు. అలాంటి సీతక్క ఇప్పుడు తన రాజకీయ వారసుడిని తెరపైకి తెస్తున్నారు. ములుగు ఎమ్మెల్యేగా ఉన్న సీతక్క వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు సూర్యను పినపాక నుంచి పోటీచేయించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యాక పినపాక నుంచి కుమారుడికి టికెట్ తెచ్చుకోగలననే ధీమాను సీతక్క వ్యక్తం చేస్తున్నారు. సీతక్క కుమారుడు సూర్య కొద్దినెలలుగా పినపాక నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ కాంగ్రెస్ క్యాడర్ ను బలోపేతం చేస్తున్నాడు. ఇటీవల గుండాలలో పర్యటించి తన పోటీ గురించి మాట్లాడాడు. పార్టీ ఆదేశిస్తే పినపాక నుంచే తాను బరిలోకి దిగుతానని సూర్య అన్నారు. ఒకప్పుడు ఖమ్మం జిల్లాలో పినపాక నియోజకవర్గం భాగంగా ఉండేది. ఇప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉంది. కాంగ్రెస్ కు పట్టున్న నియోజకవర్గం ఇది. ప్రస్తుతం పినపాక ఎమ్మెల్యేగా ఉన్న రేగ కాంతారావు కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వ్యక్తినే. 2018లో కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి పాయం వేంకటేశ్వరులుపై సుమారు 20వేల ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. అనంతరం రేగా కాంతారావు 2019లో టీఆర్ఎస్ లో చేరారు. ఇక 2014 ఎన్నికలలో పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. 2009లో రేగ కాంతారావు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. ఇక ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యేగా సీతక్క ఉన్నారు. ఈ ములుగుకు పక్క నియోజకవర్గమే 'పినపాక'. రెండూ కూడా మహబూబాబాద్ లోక్ సభ నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. రెండూ ఎస్టీ నియోజకవర్గాలే. సీతక్కకు పినపాకలో కూడా మంచి పట్టుంది. ఇవన్నీ తన కుమారుడు సూర్యను గెలిపించుకోవడానికి సహకరించే అంశాలు. ఈ నేపథ్యంలో సూర్యకు పినపాక టికెట్ కోసం సీతక్క ప్రయత్నిస్తోంది. గెలుపు బాధ్యత తీసుకుంటానని కాంగ్రెస్ కు చెబుతోంది. మరి అధిష్టానం ఇస్తుందా? లేదా? అన్నది వేచిచూడాలి.

# భైరి నరేష్ తో బండి సంజయ్ భేటి అయ్యారా? అసలు నిజం ఇదీ

హైదరాబాద్ : దళిత నేత భైరి నరేష్ ఇటీవల అయ్యప్ప స్వామిపై అయ్యప్ప భక్తులపై చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఆయన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అయ్య ప్ప స్వాములు ఆందోళనలతో అట్టుడికించారు. నరేష్ పై.. ఆయన మద్దతు తెలిపిన సోదరుడు భైరి అగ్నితేజ్ పై దాడులకు పాల్పడ్డారు. ఉద్రిక్తతలకు దారితీయడంతో నరేష్ అగ్నితేజ్ లపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే భైరి నరేష్ అరెస్ట్ తర్వాత ఓ వెబ్ సైట్ లో రాసిన కథనం తెలంగాణ వ్యాప్తంగా సంచలనమైంది. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యానించిన 'భారత నాస్తిక సంఘం తెలంగాణ అధ్యక్షుడు భైరి నరేష్'తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ భేటి అయ్యారని.. ఈ భేటి తర్వాతనే హిందూ దేవుళ్లపై నరేష్ ఈ వ్యాఖ్యలు చేశారని టాక్ నడిచింది. జైశ్రీరామ్ అంటూ హిందుత్వ భావజాలంతో వెళ్లే బీజేపీ నేత బండి సంజయ్ ఇలా భైరి నరేష్ తో ఎందుకు భేటి అయ్యాడు. ? బండినే రెచ్చగొట్టాడా? అన్న ప్రచారం సోషల్ మీడియాలో వెబ్ సైట్లలో జరిగింది.

ఈ వార్త వైరల్ కావడంతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో దుమారం రేపింది. బండి సంజయ్ చేసిన చర్యపై బీఆర్ఎస్ తోపాటు కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. దీంతో ట్విటర్ వేదికగా బీజేపీ స్పందించింది.. క్లారిటీ ఇచ్చింది. సదురు వెబ్ సైట్ లో వచ్చిన ఆ వార్తను స్క్రీన్ షాట్ తీసి ట్విటర్ లో పోస్ట్ చేసి ఇది ఫేక్ న్యూస్ అని బండి సంజయ్ ఎప్పుడూ భైరి నరేష్ తో భేటి కాలేదని.. ఇది పూర్తిగా అవాస్తమని ఖండించింది. ఇలాంటి తప్పుడు వార్తలతో బండి సంజయ్ బీజేపీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలంగాణ బీజేపీ హెచ్చరించారు. అయితే బీజేపీ క్లారిటీ ఇచ్చినా కూడా బండి సంజయ్ ఈ విషయంపై చెప్పాలని.. టీఆర్ఎస్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారని.. యాదగిరి గుట్ట వెళ్లి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రమాణం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ విషయంలో బండి మాట్లాడకుండా బీజేపీ తరుఫున ప్రకటన చేయడమే అందరిలోనూ అనుమానాలు రేకెత్తిస్తోంది.

# బాబు పర్యటనకు బ్రేక్.. అనుమతించని అధికారులు



హైదరాబాద్: తన సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లాలోని కుప్పంలో పర్యటించేందుకు రెడీ అయిన.. టీడీపీ అధినేత చంద్రబాబుకు పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం చం ద్రబాబు రోడ్షో సభలకు అనుమతి లేదని పోలీసులు నోటీసులు ఇచ్చారు. చంద్రబాబు రోడ్షో సభలకు వెళ్తే కేసులు నమోదు చేస్తామని టీడీపీ నేతలను హెచ్చరించారు.

పోలీసుల తీరుపై స్థానిక టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేగా కుప్పంలో ఎక్కడై నా.. సభలు నిర్వహించే హక్కు చంద్రబాబుకు ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. చంద్రబాబు సభ ను టీడీపీ నేతలు జరిపి తీరుతామంటున్నారు. టీడీపీ శ్రేణులను అడ్డుకుంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన లు చేస్తామని టీడీపీ నేతలు హెచ్చరించారు. వాస్తవానికి రాష్ట్రంలో ఇదేం ఖర్మ పేరుతో టీడీపీ నేతలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే విజయనగరం నెల్లూరు జిల్లాల్లో పర్యటించిన చంద్రబాబు.. తాజాగా తన సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటించేందుకు రెడీ అయ్యారు. అయితే.. గుంటూరు కందుకూరు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం సరికొత్త జీవోను తీసుకువచ్చింది. దీని ప్రకారం.. ర్యాలీలు సభలకు కొంత నియంత్రణ ఉంటుంది. ఇదే ఇప్పుడు ఏపీలోనూ సాగుతోంది. కుప్పం పర్యటనకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని.. టీడీపీ నాయకులు.. లేదు టీడీపీ నేతలు తమకు సరైన రోడ్ మ్యాప్ ఇవ్వలేదని పోలీసులు పరస్పరం వాదించుకుంటున్నారు. ఈ క్రమంలో పోలీసులు టీడీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. ఒక నిర్దేశిత ప్రాంతంలోనే సభ పెట్టుకోవాలని.. పేర్కొన్నారు.

అయితే ఈ నోటీసులపై టీడీపీ నేతలు స్పందించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పోలీసులు మరో నోటీసు ఇచ్చారు. సమావేశాలకు ఎలాంటి అనుమతి లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు.. ఏదైనా జరిగితే.. దానికి నేతలే బాధ్యత వహించాలని తేల్చి చెప్పారు. అంతేకాదు తగిన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. అయితే.. టీడీపీ నాయకులు మాత్రం షెడ్యూల్ ప్రకారం తమ నాయకుడి కార్యక్రమాలు జరుగుతాయని.. మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# మీడియా.. వైఎస్ఆర్ .. ఓ రేవంత్ రెడ్డి సంకల్పం



హైదరాబాద్ : అది చంద్రబాబు సీఎంగా ఉన్న రోజులు.. 2004కు ముందు రెండు సార్లు టీడీపీ అధికారంలో ఉంది. నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి మరీ కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చారు. మీడియా మొత్తం చంద్రబాబు వెంట ఉన్నా.. వైఎస్ఆర్ ను విలన్ గా ప్రొజెక్ట్ చేసినా కూడా ఆయనను ప్రజలు ఆదరించారు. మళ్లీ గెలిపించారు. ఇప్పుడు ఆ నమ్మకమే తమను గెలిపిస్తుందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ బోయినపల్లిలో ఉన్న గాంధీ ఐడియాలజీ సెంటర్ లో పీసీసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ధరణి పోర్టల్ పై పార్టీ నేతలకు అవగాహన కల్పించడంతోపాటు జనవరి 26న ప్రారంభం కానున్న హాత్ సే హాత్ జోడోయాత్రలు పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి బీమా అమలు ఎన్నికల నిబంధనపై చర్చించనున్నారు. ఈ సమావేశం సందర్భంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ మాట్లాడుతూ.. 'టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు మీడియా మొత్తం సపోర్టు చేసినా దివంగత సీఎం వైఎస్ఆర్ ను ఏమీ చేయలేకపోయారు. ఏ మీడియా కూడా ప్రభుత్వాన్ని శాసించలేదు. చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుందాం.. అధికారం సాధించే దిశగా పనిచేద్దాము.. దేశ సరిహద్దులు ఆక్రమణలకు గురవుతున్నా ప్రధాని మోడీ స్పందించడం లేదు. అలాంటిదేమీ లేదని ప్రధాని చెప్పడం దురాక్రమణలకు అనుమతి ఇచ్చినట్లే అవుతుంది. ప్రధానిగా అవకాశం వచ్చినా సోనియా పదవి స్వీకరించలేదు. దేశానికి మంచి నాయకత్వాన్ని సోనియా అందించారు. చలిని సైతం లెక్కచేయకుండా రాహుల్ భారత్ జోడోయాత్ర చేస్తున్నారు. రాష్ట్రంలో 2003లో ఎలాంటి విపత్కర సమస్యలు ఎదుర్కొన్నారో 2023లో అలాంటి పరిస్తితులే ఉన్నాయని.. ఇలాంటి పరిస్థితుల నుంచి ప్రజలను రక్షించేది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. అందరం కష్టపడితే కేసీఆర్ ఒక లెక్క కాదు అంటూ రేవంత్ తన శ్రేణులకు భరోసానిచ్చారు.

నిజానికి 2003లో దివంగత మహానేత వైఎస్ఆర్ చేపట్టిన పాదయాత్ర ఒక సంచలనమనే చెప్పాలి. మీడియా మొత్తం వ్యతిరేకంగా ఉన్నా ఇందిరమ్మ రాజ్యం తెస్తానని వైఎస్ఆర్ బయలుదేరారు. పాదయాత్రతో వైఎస్ఆర్ సమూల మార్పులు తీసుకువచ్చారు. ఎంతోమంది వైఎస్ఆర్ పాదయాత్రలో భాగస్వాములయ్యారు. కాంగ్రెస్ ను అధికారం దిశగా నడిపారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా పాదయాత్ర చేయాలని.. కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావాలని కృతనిశ్చయంతో ఉన్నారు.

# హైదరాబాద్‌లో డ్రగ్ స్మగ్లర్ అరెస్ట్.. ఫోన్‌లో 8వేల మంది ప్రముఖుల పేర్లు!



హైదరాబాద్: భారీ డ్రగ్ స్మగ్లర్లు పట్టుబడ్డారు. మత్తు మాఫియా కింగ్ ల ఫోన్లలో ప్రముఖుల చిట్టాలు బయటపడుతున్నాయి. తాజాగా డ్రగ్స్ మాఫియా ప్రధాన సూత్రధారులను పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు ఈ డ్రగ్స్ పెడ్లర్లు స్మగ్లర్లతో కొందరు ప్రముఖులకు సంబంధం ఉందని ప్రాథమికంగా గుర్తించడం సంచలనమైంది. హైదరాబాద్ లో డ్రగ్స్ ప్రధాన సూత్రధారులను అరెస్ట్ చేసిన పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. మరిన్ని వివరాలు సేకరించాక నోటీసులు జారీ చేయాలని చూస్తున్నారు. గోవా కేంద్రంగా జాతీయ అంతర్జాతీయ స్మగ్లర్లతో సంబంధాలున్న కీలక సూత్రధారులు 18 మందిని గుర్తించారు. వీరిలో ప్రతీష్ నారాయణ్ బోర్కర్ జాన్ స్టీఫెన్ డిసౌజా తుకారాం ఎడ్విన్ న్యూన్స్ బాలమురుగన్ హేమంత్ అగర్వాల్ వికాస్ నాయక్ సంజ గోవెకర్ రమేష్ చౌహాన్ వంటి డ్రగ్ కింగ్ పిన్ లను అరెస్ట్ చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. ఇక ఈ అరెస్ట్ అయిన వారి ఫోన్లు చూస్తే మైండ్ బ్లాక్ అయిపోయింది పోలీసులకు. ఎందుకంటే సుమారు 8 వేల మంది డ్రగ్స్ వినియోగిస్తున్న వారి వివరాలు ఉన్నాయి. ఇందులో కొందరు ప్రముఖుల పేర్లు కూడా ఉండడం చూసి షాక్ అయ్యారు. విచారణ జరిపి ఆధారాలు సేకరించి దాదాపు 400 మందికి 41ఏ సీఆర్పీసీ నోటీసులు జారీ చేశారు.

గోవా డ్రగ్ కింగ్ పిన్ ఎడ్విన్ నుంచి హైదరాబాద్ లో అరెస్ట్ అయిన డీజే మోహిత్ అగర్వాల్ వరకూ ఎక్కువమంది పబ్ లు హోటళ్లలో సర్వర్లుగానే కెరీర్ ప్రారంభించి ఏకంగా డ్రగ్ స్మగ్లర్లుగా ఎదగడం విశేషం. మత్తుపదార్థాల దందాలో బాగా ఎదిగారు. మాఫియాతో సంబంధాలు పెంచుకొని మత్తు సామ్రాజ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. ఖరీదైన భవనాల్లో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని పోలీసులు తేల్చారు. డ్రగ్స్ దందాతో వీరు బాగా దోచుకున్నారని సమాచారం. కోట్లాది రూపాయాల ఆస్తిపాస్తులున్నట్టు తేలింది.

ఈ డ్రగ్ మాఫియా ఫైనాన్స్ చేసే స్తాయికి ఎదిగిందని.. తమిళనాడు కు చెందిన బాలమురుగన్ కీలక వ్యక్తిగా తేల్చారు. హిమాచల్ ప్రదేశ్ కేంద్రంగా రాజస్థాన్ మహారాష్ట్ర హైదరాబాద్ పర్యాటక ప్రాంతాలు హోటల్స్ పబ్ లకు డ్రగ్స్ సరఫరా చేసినట్టు గుర్తించారు.

హైదరాబాద్ లో పట్టుబడిన మోహిత్ సర్వర్ నుంచి డ్రగ్ డాన్ గా ఎదిగాడు. బాలీవుడ్ నటి నేహా దేశ్ పాండేను ప్రేమించి పెళ్లి చేసుకోవడం విశేషం. ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థ స్థాపించి డీజేలను దేశానికి రప్పించి ఆ ముసుగులో వేడుకల్లో ఈ డ్రగ్స్ దందా చేస్తున్నట్టు తేలింది. ప్రస్తుతం ఇతడితో అంటకాగిన కొంతమందికి నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు రెడీ అయినట్టు సమాచారం. ఇందులో కొందరు బాలీవుడ్ టాలీవుడ్ సినీ ప్రముఖులు ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. వారికి పోలీసులు నోటీసులు ఇచ్చి విచారించేందుకు పోలీసులు రెడీ అయ్యారు.

సిరా వెలుగు
తెలుగు దినపత్రిక



## బండి సంజయ్ ఔట్.?

## తెలంగాణ బీజేపీ చీఫ్ గా ఈటల?

హైదరాబాద్ : తెలంగాణలో కేసీఆర్ ను కొట్టాలి. వచ్చే ఎన్నికల్లో ఓడించాలి. బీజేపీ అధికారంలోకి రావాలి. ఇందుకోసం ఏం చేయడానికైనా వెనుకాడమని ఇటీవల బయటపడ్డ 'ఫాంహౌస్ ఫైల్స్' సినిమా చూస్తేనే అందరికీ అర్థమైంది. అందుకే బీజేపీకి తెలంగాణలో మైనస్ లు ఉంటే వెంటనే వాటిని తొలగించడానికి రెడీ అవుతోందట.. తన నోటి మాటలతో బీజేపీకి నష్టం చేకూరుస్తూ ప్రజల్లో బీజేపీపై వ్యతిరేకత పెంచుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కూడా అవసరమైతే సాగనంపేందుకు రెడీ అయ్యిందని.. బీజేపీ కొత్త చీఫ్ గా ఈటల రాజేందర్ ను చేయడాలని ఆ పార్టీ యోచిస్తోందని ఓ ప్రచారం తెలంగాణ రాజకీయాల్లో సాగుతోంది.తెలంగాణలో ఒట్టి ఊకదంపుడు ఆందోళనలు గాయి గత్తర లేపడం తప్పితే కేసీఆర్ ను ఇరుకునపెట్టేలా బండి సంజయ్ రాజకీయాలు చేయడంలేలదన్న టాక్ ఉంది. కేసీఆర్ ఎత్తులకు మించి పనిచేయాలని కోరుకుంటోంది. ఈ క్రమంలోనే కేసీఆర్ గుట్టుమట్లు అన్ని తెలిసి ఆయనతో ఉద్యమకాలం నుంచి సహవాసం చేసిన ఈటల రాజేందర్ కే ఈ బీజేపీ పగ్గాలు అప్పగించాలని బీజేపీ యోచిస్తున్నట్టు సమాచారం.తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీని ఢీకొట్టడానికి బీజేపీ చేయని ప్రయత్నాలు లేవు.. దూకుడు స్వభావంతో ముందుకెళ్తున్న ఆ పార్టీ నాయకులు కేసీఆర్ ఆలోచనలు అందుకోలేకపోతున్నారు. ముఖ్యంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నోటిదురుసు బీజేపీకి బాగా మైనస్ అవుతోంది.

అయితే మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ తరుణంలో బీజేపీ నుంచి సీఎం అభ్యర్థి ఎవరనే విషయంపై తీవ్రంగా చర్చ సాగుతోంది. ఈ సమయంలో బండి సంజయ్ ను చేస్తే బీజేపీ మరింత డ్యామేజ్ అవుతుందని.. అతడికి కేంద్రంలో పదవి ఇచ్చి సాగనంపాలని స్కెచ్ గీస్తున్నట్టు సమాచారం. బండి సంజయ్ కి కేంద్రంలో సముచిత స్థానం ఇస్తారని రాష్ట్రంలో ఈటల రాజేందర్ కు పార్టీ బాధ్యతలు అప్పగిస్తారని అంటున్నారు. దీనిపై పార్టీ అధికారిక ప్రకటన చేయలేదు.తెలంగాణలో బీసీ జనాభా ఎక్కువ. వారిని బీజేపీ వైపు మళ్లించాలంటే బీసీ అయిన ఈటల బెస్ట్ అని బీజేపీ యోచిస్తోందట.. ఈటల సామాజికవర్గం ముదిరాజ్ లను బీజేపీకి చేరువ చేయాలన్నది బీజేపీ ఆలోచన. అందుకే తెలంగాణలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ లను ఆకర్షించేందుకు ఈటలను ముందుపెట్టాలని భావిస్తున్నట్టు సమాచారం.

మునుగోడులో ఓటమికి బండి సంజయ్ కారణమని కేంద్రానికి రిపోర్టు పంపించారట.. ఈ ఓటమితోనే బండి సంజయ్ పై నమ్మకం పోయిందని అంటున్నారు. అందుకే ఈటలను బీజేపీ చీఫ్ ను చేయాలని ప్లాన్ చేసినట్టు సమాచారం. మరి ఈ ప్రచారం బీఆర్ఎస్ సృష్టించిందా..? లేక నిజంగానే బండి సంజయ్ ని బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తారా? ఇదంతా నిజమా? ప్రచారమా? అన్నది తెలియాల్సి ఉంది.

## వేడెక్కిన యూరోప్..

## జనవరిలో వింటర్ హీట్

వార్సా: యూరోప్‌లో అప్పుడే వేడి మొదలైంది. శీతాకాలంలోనే అక్కడ ఉష్ణోగ్రతలు ఊపందుకున్నాయి. పలు యూరోప్ దేశాల్లో జనవరి ఒకటో తేదీన కొత్త రికార్డులు నమోదు అయ్యాయి. దాదాపు ఎనిమిది దేశాల్లో అత్యధిక స్థాయిలో జనవరి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. శీతాకాలంలో వెదర్ వేడిగా మారడం..యురోపియన్లను కలవరపెడుతోంది. ఆ ఖండంలో 18 నుంచి 36 డిగ్రీల మధ్య అనేక ప్రాంతాల్లో టెంపరేచర్లు రికార్డు అయ్యాయి. ఫ్రాన్స్ నుంచి పశ్చిమ రష్యా వరకు ఉష్ణోగ్రతలు అనూహ్యంగా మారాయి.

పోలాండ్‌లోని వార్సాలోని ఆదివారం 18.9 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగత్ర రికార్డు అయ్యింది. ఇక స్పెయిన్‌లోని బిల్బావోలు 25.1 డిగ్రీల సెంటిగ్రేడ్ నమోదైంది. ఈ రెండు ప్రాంతాల్లో సగటు జనవరి ఉష్ణోగ్రతల కన్నా పది డిగ్రీలు అధికంగా నమోదు అయ్యాయి. వాతావరణ మార్పుల వల్లే అనేక చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.


లత్వియా, డెన్మార్క్, లుథియేనా, బెలారస్, నెదర్లాండ్స్, పోలాండ్, చెక్ రిపబ్లిక్ దేశాల్లో జనవరి ఒకటో తేదీన అధిక టెంపరేచర్లు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. జర్మనీ, ఫ్రాన్స్, ఉక్రెయిన్ దేశాల్లోనూ కొత్త రికార్డులు నమోదు అయినట్లు తెలుస్తోంది.

## ఇంటర్ ఫీజు ఫైన్ రూ.100కు తగ్గింపు

### గతంలో రూ.1,000 ఆలస్య రుసుము

### 90 వేల మంది విద్యార్థులకు ఉపశమనం

### ఈ నెల 6తో ముగియనున్న గడువు



హైదరాబాద్ మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కారణంగా అఫిలియేషన్లు పెండింగ్‌లో ఉండి ఇంటర్ పరీక్ష ఫీజును చెల్లించలేకపోయిన విద్యార్థులకు ఉపశమనం కల్పిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రస్తుతం ఉన్న ఆలస్య రుసుము రూ.1,000ని రూ.100కు తగ్గించింది. బుధవారం బషీర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డి.. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్‌బోర్డు కార్యదర్శి నవీన్‌మిట్టల్‌తో ఫీజులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలస్య రుసుమును తగ్గించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కారణంగా 446 ప్రైవేట్ జూనియర్ కాలేజీలు ఇంటర్‌బోర్డు నుంచి అనుబంధ గుర్తింపును పొందలేకపోయాయి.దీంతో వీటిల్లోని 90 వేలకు పైగా విద్యార్థులు పరీక్ష ఫీజులను చెల్లించలేకపోయారు. ఇటీవలే మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలకు ఫైర్ ఎన్వోసీ నుంచి మినహాయింపునివ్వటంతో ఆయా కాలేజీలు అనుబంధ గుర్తింపును దక్కించుకున్నాయి. ఈ నేపథ్యంలో వారి ఫీజు చెల్లింపు ఆలస్యమైంది.

దీంతో ఒక్కో విద్యార్థి రూ.వెయ్యి జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తింది. కాలేజీల యాజమాన్యాలు ఫైన్ తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరగా.. తాజాగా విద్యార్థులకు ఉపశమనం కల్పిస్తూ నిర్ణయం తీసుకొన్నది. అటు.. మార్చి 15 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు 8 లక్షల మంది విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించారు. ఈ సంఖ్య 9 లక్షలకు చేరనున్నదని అధికారులు పేర్కొన్నారు.

# అబద్ధపు ప్రచారాలు తిప్పికొట్టాలి :

# మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



నిజామాబాద్ : దేవుని పేరు మీద రాజకీయాలు, తెలంగాణ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్న వారిని తిప్పికొట్టాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా
భీంగల్ మండలం సికింద్రపూర్ గ్రామంలో 8 కోట్ల 40 లక్షల వ్యయంతో నిర్మించిన 10వేల మెట్రిక్ టన్నుల గోడౌన్ ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో అన్ని వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ఓర్వలేని రాజకీయ పార్టీలు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో పని చేస్తున్నది ఎవరు..? మాటలు చెప్పేది ఎవరో ప్రజలు ఆలోచించాలని సూచించారు . బాల్కొండ నియోజకవర్గంలో గతంలో ఒక్క టన్ను నిల్వ చేసుకునే గోడౌన్ కూడా లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ దయతో నేడు 25 కోట్లతో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ సామర్థ్యం గల గోడౌన్లు నిర్మించుకున్నామని తెలిపారు. సీఎం విప్లవాత్మక నిర్ణయాల వల్ల సాగు విస్తీర్ణం,ధాన్యం ఉత్పత్తి మూడు రెట్లు పెరిగిందని అన్నారు.

రైతు బంధు,రైతు బీమా,24గంటల ఉచిత విద్యుత్, సాగునీటి కోసం కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు, సకాలంలో ఎరువుల పంపిణీపై ఇతర రాష్ట్రాల ప్రజలు ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న కార్యక్రమాలను చూసి యావత్ దేశం కేసీఆర్ నాయకత్వం కావాలని కోరుకుంటుందని అన్నారు. అనంతరం అధునాతన సౌకర్యాలతో నిర్మించిన గోదాంను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సహకారశాఖ ప్రాధాన్యం పెరిగింది : నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్ : సహకారశాఖ ప్రాధాన్యం పెరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గృహకల్పలో బుధవారం తెలంగాణ సహకార గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార శాఖ ఉద్యోగులకు నిరంతర శిక్షణలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న సంపద దుర్వినియోగం కాకుండా కాపాడాలన్నారు. సాగునీటి రాకతో గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు.

ఈ పరిస్థితుల్లో సహకార శాఖ ప్రాధాన్యం పెరిగిందన్న ఆయన.. నీటి వృథాను అరికట్టడం, సాగు చేయాల్సిన పంటల రకాల మీద రైతులను చైతన్యం చేసే బాధ్యత సహకార శాఖ అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతిరంగంలో మనుషుల మధ్య సంబంధాలను పెంచేందుకు కృషిచేయాలని, సహకార సంఘాలు బలోపేతం కాకుంటే కార్పోరేట్ వ్యవస్థ వేళ్లూనుకుంటుందని హెచ్చరించారు. దాంతో సమాజానికి నష్టం చేకూరుతుందన్నారు.గతంలో సహకార సంఘాల్లో ఉద్యోగుల జీతాలకు ఇబ్బందులుండేవని, తెలంగాణ ఏర్పాటు తర్వాత సహకార సంఘాలు బలోపేతమయ్యాయన్నారు. సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహకార ఉద్యోగులు కేరళలోని సహకార సంఘాలను అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర సహకార ఉద్యోగుల సంఘం నేత నర్సింహారెడ్డి, సంఘం అధ్యక్షుడు జగన్ మోహన్ రావు, అడిషనల్ రిజిస్ట్రార్లు సుమిత్ర, శ్రీనివాసరావు, టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో లూయిస్ బ్రెయిలి భారీ విగ్రహం ఆవిష్కరణ





హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ మానవతా కోణంలో దివ్యాంగుల సంక్షేమానికి కోట్లాది నిధులు ఖర్చు చేస్తుందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. లూయిస్ బ్రెయిలి జయంతి సందర్భంగా హైదరాబాద్ మలక్ పేట దివ్యాంగుల సహకార సంస్థ కార్యాలయంలో అత్యంత ఎత్తయినా లూయిస్ బ్రెయిలి తొమ్మిది అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలి అని పేర్కొన్నారు. కంటి చూపు లేని వారికి లిపిని అందించిన ఘనత లూయిస్ బ్రెయిలికి దక్కిందన్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో తన అంధత్వాన్ని జయించాడని, అంధుల కోసం బ్రెయిలి లిపిని రూపొందించారాని చెప్పారు. ఏ రాష్ట్రం లో లేని విధంగా దివ్యాంగులకు మూడు వేల రూపాయలు పెన్షన్ అందిస్తూ న్నామని చెప్పారు.రాష్ట్రంలోని 5 లక్షల 51 వేల మంది దివ్యాంగులకు సంవత్సరానికి రూ. 2000 కోట్లను ఖర్చు చేస్తుందన్నారు. దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా ఉమ్మడి పాలనలో 30 శాతం సబ్సిడీతో మాత్రమే సహాయ ఉపకరణాలు అందేవని, నేడు వందశాతం సబ్సిడీతో ఉచితంగా అనేక సహాయ ఉపకరణాలను అందిస్తున్నామని తెలిపారు.దివ్యాంగుల సంక్షేమ శాఖ బడ్జెట్‌ను రూ. 20 కోట్ల నుంచి రూ. 83 కోట్లకు పెంచారని వెల్లడించారు.పలువురు అంధ విద్యార్థులు, ఉద్యోగులను మంత్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహమూద్ అలీ, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కే వాసుదేవ రెడ్డి, దివ్యాంగుల సహకార సంస్థ జేఎండీ శైలజ, జీఎం ప్రభంజన్ రావుతో పాటు పలువురు వికలాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 11న ఫార్ములా

# ఈ రేస్.. ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల

హైదరాబాద్ : ఫార్ములా ఈ రేస్ పోటీలకు హైదరాబాద్ నగర్ సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 11న ప్రారంభం కాబోయే ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించిన టికెట్లను బుక్ మై షోలో విడుదల చేశారు. ఈ టికెట్ల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపాలిటీ, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ హాజరయ్యారు.రూ. 1000 నుంచి రూ. 10 వేల వరకు టికెట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తంగా 22,500 టికెట్లను విక్రయించనున్నారు. రూ. 1000కు గ్రాండ్ స్టాండ్, రూ. 3,500కు ఛార్జ్ గ్రాండ్ స్టాండ్, రూ. 6 వేలకు ప్రీమియం గ్రాండ్ స్టాండ్, రూ. 10 వేలకు ఏస్ గ్రాండ్ స్టాండ్ టికెట్లను విక్రయించనున్నారు.

అయితే ఫిబ్రవరి 11న ఫార్ములా ఈ రేస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో 10వ తేదీన ప్రాక్టీస్ రేసింగ్ నిర్వహించనున్నారు.

ఈ రేస్‌లో 11 దేశాల నుంచి మొత్తం 22 మంది డ్రైవర్లు పాల్గొంటున్నారు. రేస్ నిర్వహణ కోసం హుస్సేన్ సాగర్ తీరాన 18 మలుపులతో 2.8 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. గత నెలలో ఇండియన్ రేసింగ్ లీగ్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే.



# ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో అదిరిపోయే ట్విస్ట్



ఢిల్లీ: తెలంగాణ ఢిల్లీ ప్రభుత్వాలను షేక్ చేసిన ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో అదిరిపోయే ట్విస్ట్ వచ్చేసింది. ఈ స్కాంలో ఆమ్ ఆద్మీ బీఆర్ఎస్ నేతలతోపాటు ఏపీ ఎంపీ పేరు కూడా ప్రస్తావనకు రావడంతో దేశవ్యాప్తంగా సంచలనమైంది. ఇప్పటికే పలువురు వ్యాపారులు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. పలువురు రాజకీయ నేతల పేర్లు బయటకు వచ్చాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్ కు చెందిన మరో వ్యక్తి పేరు తెరపైకి రావడం సంచలనమైంది. తాజాగా సైంటిస్టు ప్రవీణ్ కుమార్ గొరకవి పేరు ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బయటకు వచ్చింది. నిధుల మళ్లింపు విషయంలో ఈడీ ఈ సైంటిస్ట్ ప్రవీణ్ పేరును ఛార్జ్ షీటులో దాఖలు చేసింది. ఈడీ ఛార్జ్ షీటులో కీలక అంశాలను ప్రస్తావించింది. దుబాయ్ కంపెనీతోపాటు 'ఫ్లై' కంపెనీకి నిధుల మళ్లింపు జరిగిందని ఈడీ నిర్ధారణకు వచ్చింది.అసలు ఈ ఫ్లై కంపెనీ ఓనర్ యే ఈ సైంటిస్ట్ ప్రవీణ్ కుమార్. దీంతో ఈడీ ప్రత్యేకంగా ఈ ఢిల్లీ లిక్కర్ స్కాంలో ప్రవీణ్ పాత్రపై ఫోకస్ పెట్టింది. ప్రవీణ్ ఆర్థిక లావాదేవీలు.. ఎవరెవరు ఎంతెంత ఈ ఫ్లై కంపెనీకి నిధులు మళ్లించారు అనే విషయంపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఈ స్కాంలో నిధులు హవాలా రూపంలో ప్రవీణ్ కంపెనీకి మళ్లించారు ఈడీ. గతంలోనూ ప్రవీణ్ ఇంటిపై ఈడీ దాడులు చేసి రూ.24 లక్షలు స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో చిక్కిన సీఏ బుచ్చిబాబుకు ప్రవీణ్ సన్నిహితుడిగా ఈడీ గుర్తించింది.ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన మంత్రి అరెస్టయిన విషయం తెలిసిందే. అలాగే తెలంగాణకు చెందిన శరత్ చంద్రారెడ్డి బినోయ్ బాబు విజయ్ నాయర్ అభిషేక్ బోయినపల్లిలను కూడా ఈ స్కాంలో నిందితులుగా చేర్చారు. అయితే నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత కూడా ఈ కుంభకోణంలో భాగస్వామి అని ఆమె అత్యధికంగా లబ్ధిపొందుతారని ఎన్ ఫోర్స్ మెండ్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. కవితతో పాటు మాగుంట శ్రీనివాస్ రెడ్డి అతడి కుమారుడు రాఘవ్ రెడ్డి అరబిదో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి పేర్లను కూడా ఈడీ తన చార్జ్ షీట్ లో తెలిపిందిఇండోస్పిరిట్ సంస్థ అసలు భాగస్వాములు మాగుంట రాఘవ్ రెడ్డి కవిత అని ఈడీ తెలిపింది. ఈ సంస్థకు ఎల్ 1 కింద వచ్చిన షాపుల్లో కవితకు వాటా ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఇండోస్పిరిట్ సంస్థకు చెందిన రామచంద్ర పిళ్లై వెనుక ఉన్నది కవిత అని తెలిపింది. మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాగుంట రాఘవ్ రెడ్డి తుపున ప్రేమ్ రాహుల్ పనిచేస్తున్నారని రిటైల్ లో 14కోట్ల బాటిళ్లను విక్రయించడం ద్వారా రూ.195 కోట్లను సంపాదించినట్లు ఈడీ పేర్కొంది. తాజాగా సీబీఐ కూడా కవితను విచారించింది. సాక్షిగా పేర్కొని నోటీసులు జారీ చేసి విచారించింది.

# ఢిల్లీ యువతి కేసులో వెలుగులోకి సంచలన విషయాలు!



ఢిల్లీ:ఢిల్లీలో కొత్త సంవత్సరం జనవరి 1 రాత్రి స్కూటీపై వెళ్తున్న 20 ఏళ్ల మహిళను కారులో ఉన్న ఐదుగురు నిందితులు గుద్ది చంపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితులతో కారుతో యువతిని గుద్దాక.. ఆమె కాలులో కారు టైరులో ఇరుక్కుపోయిందనే విషయం వారికి తెలుసని పోలీసుల విచారణలో తేలింది.అలాగే యువతిని కారు కింద 13 కిలోమీటర్లు ఈడ్చుకుపోయారు. దీంతో యువతి శరీరంపై 40 చోట్ల బలమైన గాయాలు అయ్యాయి. గాయాల తీవ్రత ఎంతగా ఉందంటే.. రోడ్లుపైన ఈడ్చుకుపోవడంతో ఆమె చర్మం ఒలుచుకువచ్చేసింది. దీంతో ఆమె పక్కటెముకలు ఆమె వెనుక నుండి బయటపడ్డాయి పోస్టుమార్టం రిపోర్టులో ఈ విషయాలు బయటపడ్డాయి.ఆమె పుర్రె ఫ్రాక్చర్ అయింది. అలాగే మెదడులో కొంత భాగం కనిపించడం లేదని పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. ఈ ప్రమాదంలో యువతికి తల వెన్నెముక దిగువ అవయవాలపై బలమైన గాయాలయ్యాయి. కారు ఆమెను 13 కిలోమీటర్లు ఈడ్చుకుపోవడంతో గట్టిగా రోడ్డు కొట్టుకుపోవడంతో యువతికి గట్టి దెబ్బలు తగిలాయని పోస్టుమార్టం పరీక్షలో బయటపడింది.

బాధితురాలు తన స్నేహితురాలితో కలిసి స్కూటర్పై న్యూ ఇయర్ పార్టీకి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా ఈ ఘటనకు ముందు మృతి చెందిన యువతితో స్కూటీపై వెళ్లిన యువతి స్నేహితురాలిని కూడా పోలీసులు విచారించారు. కాగా నిందితులకు తమ కారు కింద యువతి ఇరుక్కుపోయిందనే విషయం తెలుసు అని బాధితురాలి స్నేహితురాలు చెప్పింది. తన ఫ్రెండుతో తాను గొడవ పడి స్కూటీ దిగానని.. ఆ సమయంలో కారు స్కూటీపై ఉన్న తన స్నేహితురాలిని ఢీకొట్టిందని ఆమె పోలీసులకు వివరించింది. అంతేకాకుండా కారు కింద చక్రంలో తన స్నేహితురాలు కాలు ఇరుక్కుపోయిందని.. నిందితులు అలాగే ఈడ్చుకుపోయారని వెల్లడించింది. మృతురాలి స్నేహితురాలు మాట్లాడుతూ.. "బాలెనో మాకు తల కొట్టింది. దీంతో నేను ఒక వైపు పడ్డాను. నా స్నేహితురాలు ముందు వైపు పడింది. దీంతో తను కారు కింద ఇరుక్కుపోయింది. ఈ విషయం నిందితులకు తెలిసినా వారు ఉద్దేశపూర్వకంగానే ఆమెపైకి దూసుకెళ్లారు. అప్పటికి నా స్నేహితురాలు కేకలు వేసింది' అని మీడియాకు వివరించింది.

"నేను ఇంటికి వెళ్లి ఎవరికీ ఏమీ చెప్పలేదు. నేను ఆ ఘటనతో చాలా భయాందోళనకు గురయ్యాను. చాలా ఏడ్చాను. నిందితులు కారును రెండుసార్లు ముందుకు వెనుకకు నడిపారు. కారు కింద ఏదో ఇరుక్కుపోయిందని అనుమానం రావడంతోనే వారు ముందుకు వెనుకకు వెళ్లారు' అని తెలిపింది.

కాగా యువతి కాలు కారులో ఇరుక్కుందని తాము గమనించలేదని నిందితులు పోలీసులకు తెలిపారు. వారు హరియాణాలోని ముర్తల్ లో మద్యం తాగి ఢిల్లీకి బయలుదేరారు. ఘటన జరిగిన సమయంలో కారులో పెద్దగా సంగీతం పెట్టారు. దీంతో తమకు యువతి అరుపులు వినిపించడం లేదని నిందితులు పోలీసులకు ఇచ్చిన వాంగూల్మంలో పేర్కొన్నారు.

# లక్షన్నర ఉద్యోగాలు అందుకే పోయాయా?



ఢిల్లీ: కోవిడ్ భూతం ప్రపంచాన్ని కమ్మేసిన సమయంలో దాదాపు అన్ని సంస్థలు డిజిటల్ బాటపట్టాయి. నిత్యావసర సరుకుల కోసం ఆన్లైన్ షాపింగ్ పై ప్రజలు ఆధారపడ్డారు. అలాగే విద్యార్థులు బైజూస్ వంటి ఆన్లైన్ ఎడ్యు కంపెనీలపై ఆధారపడ్డారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఈ-కామర్స్ వెబ్సైట్లకు ఆన్లైన్ ఎడ్యు టెక్ కంపెనీలకు బాగా ఆదరణ పెరిగింది. యూట్యూబ్ వీడియోలకు సైతం అంతే ఆదరణ దక్కింది.దీంతో ఎడ్యుటెక్ కంపెనీలు ఈ-కామర్స్ వెబ్సైట్లకు సాంకేతిక సేవలు అందించడానికి గూగుల్ అమెజాన్ ఫేసుబుక్ టీసీఎస్ ఇన్ఫోసిస్ విప్రో కాగ్నిజెంట్ యాక్సెంచర్ వంటి సంస్థలు భారీ ఎత్తున ఉద్యోగులను నియమించుకున్నాయి. తమకు వచ్చిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు అధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్నాయి. బైజూస్ వంటి స్టార్టప్స్ సైతం భారీ ఎత్తున కోవిడ్ సమయంలో ఉద్యోగులను నియమించుకున్నాయి.

ఇక 2022 నుంచి కోవిడ్ తగ్గుముఖం పట్టింది. మళ్లీ యధావిధిగా కార్యక్రమాలు మొదలయ్యాయి. స్కూళ్లు కాలేజీలు ప్రారంభమయ్యాయి. షాపులు మార్కెట్లు తెరుచుకున్నాయి. వర్క్ ఫ్రమ్ హోంను విడిచిపెట్టి ఉద్యోగులు కార్యాలయాల బాట పట్టారు. దీంతో ఐటీ కంపెనీలకు ప్రాజెక్టులు తగ్గిపోయాయి.

మరోవైపు పులి మీద పుట్రలా రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రభావాలు ఆర్థిక మందగమనం వంటి పరిస్థితులు తలెత్తాయి. దీంతో ఆయా కంపెనీలకు ప్రాజెక్టులు తగ్గిపోయాయి. వ్యయ నియంత్రణ కోసం టెక్ సంస్థలన్నీ తమ 'అవసరానికి మించి ఉన్న ఉద్యోగులను' వదిలించుకునే పనిలో పడ్డాయి.ఇలా 2022లో ప్రపంచ వ్యాప్తంగా 1013 సంస్థలు 153160 మంది ఉద్యోగులను తొలగించినట్లు లేఆఫ్స్.ఎఫ్వైఐ లైవ్ ట్రాకింగ్ సంస్థ బాంబుపేల్చింది. కోవిడ్ నుంచి చూస్తే ఇప్పటివరకు 1539 సంస్థలు దాదాపు 249151 మంది ఉద్యోగులను తొలగించినట్లు పేర్కొంది. అధిక తొలగింపులు కన్జ్యూమర్ రిటైల్ రంగాల్లోనే వెల్లడించింది.ఆర్థిక మాంద్యం కోవిడ్ అనంతర పరిస్థితులు రష్యా ఉక్రెయిన్ యుద్ధ ప్రభావాలు కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు తదితర కారణాలతో ప్రాజెక్టులు తగ్గిపోయి టెక్ కంపెనీలు నష్టాలు చవిచూశాయి. ఆర్థిక మాంద్యం ఛాయలు కనిపిస్తుండటంతో.. సాధ్యమైనంత తొందరగా ఉద్యోగులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

2022లో మెటా 11000 అమెజాన్ 10000 సిస్కో 4100 ఉద్యోగులను తొలగించినట్లు లేఆఫ్స్.ఎఫ్వైఐ తెలిపింది. ట్విటర్ సిబందిలో దాదాపు 75% మందిని ఎలాన్ మస్క్ తొలగించారు. ఇక మనదేశంలో గత ఏడాది కాలంలో పలు స్టార్టప్ సంస్థలు దాదాపు 18 వేల మంది ఉద్యోగులను తొలగించినట్లు ఇంక్.42.కామ్ నివేదిక బాంబుపేల్చింది. బైజూస్ 2500 ఓలా 2300 బ్లింకిట్ 1600 అన్ అకాడమీ 1150 వేదాంతు 1109 వైట్హాట్ జూనియర్ 1000 ఉద్యోగాల్లో కోత విధించినట్లు వెల్లడించింది.

మరోవైపు ఆర్థిక మందగమనం నేపథ్యంలో దేశీయ సంస్థలతోపాటు అంతర్జాతీయ సంస్థలూ నూతన నియామకాల్లో ఆచితూచి వ్యవహరిస్తున్నాయని వార్తలు వస్తున్నాయి. కొత్తతరం సాంకేతికతలైన కృత్రిమ మేధ మెషీన్ లెర్నింగ్ వెబ్3 డేటాసైన్స్ అనలిటిక్స్లాంటి వాటికి మాత్రమే గిరాకీ పెరుగుతోందని చెబుతున్నారు. సంస్థలు తమకు అవసరమైన పనిని చేయగల ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్నాయని అంటున్నారు.

# దారుణం.. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ నాలుకను కోసేశాడు..!




పూణె: ప్రస్తుతం సోషల్ మీడియా యుగం నడుస్తోంది. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి రావడం.. ఇంటర్నెట్ ప్లాన్స్ కారుచౌకగా లభ్యమవుతుతండటంతో జనాలు ఎక్కువగా ఆన్ లైన్లోనే గడుపుతున్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరు జీవితంలో మేటా.. ట్విట్టర్.. వాట్సాప్.. టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలు భాగస్వామ్యం అవుతున్నాయి.వాట్సాప్ లో చాటింగ్ తదితర ఫీచర్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కమ్యూనికేషన్ కోసం చాలామంది వాట్సాప్ గ్రూపుల్లో జాయిన్ అవుతున్నారు. సరదాగా ప్రారంభమైన గ్రూప్ డిస్కషన్స్ కొన్నిసార్లు వివాదాలకు సైతం దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఒక్కోసారి గ్రూప్ అడ్మిన్ పై సైతం ఇతరులు దాడిచేసే సంఘటనలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో పోలీస్ కేసులు కూడా తరుచుగా నమోదవుతున్నాయి.తాజాగా ఓ వాట్సాప్ గ్రూప్ లో చోటుచేసుకున్న చిన్న వివాదం చివరకు నాలుకలు తెగే వరకు వెళ్లింది. ప్రస్తుతం ఈ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే.. పూణెలోని ఫుర్సుంగికి చెందిన సొసైటీ ఓ వ్యక్తి కుటుంబంతో సహా నివసిస్తున్నాడు. ఈ మేరకు ఆ వ్యక్తి సొసైటీ పేరు మీద 'ఓం హైట్స్' పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాడు.

ఈ సొసైటీ గ్రూపుకు అడ్మిన్ గా ఉంటూ చాలామందిని అందులో జాయిన్ చేసుకున్నాడు. అయితే ఏమైందో తెలియదుగానీ ఓ వ్యక్తిని గ్రూప్ అడ్మిన్ తొలగించాడు. దీనిపై సదరు వ్యక్తి గ్రూప్ నుంచి తనను తొలగించడానికి గల కారణాలను అడిగాడు. అయితే ఈ విషయంపై గ్రూప్ అడ్మిన్ నుంచి ఎలాంటి వివరణ ఇవ్వలేదని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలోనే గ్రూప్ నుండి తొలగించబడిన వ్యక్తి అడ్మిన్ పై కోపం పెంచుకున్నాడు. ఏకంగా అతడు పనిచేస్తున్న కార్యాలయానికి ఐదుగురు వ్యక్తులతో కలిసి వెళ్లి దాడి చేశారు. ఈ సంఘటనలో వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ నాలుక చిట్లి పోయింది. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించగా వైద్యులు అతడికి చికిత్స చేయి నాలుకకు కుట్లు వేశారు.

ఈ సంఘటనపై అడ్మిన్ భార్య దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మరోవైపు ఇదే నగరంలో మూడ్రోజుల క్రితం హ్యాపీ న్యూయర్ విషెస్ చెప్పనందుకు ఓ వ్యక్తి చేయిని మరో వ్యక్తి విరిచి వేయడం గమనార్హం. మొత్తానికి వాట్సాప్ గ్రూప్ లు వ్యక్తుల మధ్య కమ్యూనికేషన్ పెంచడంతో పాటుగా మరోవైపు వివాదాలకు కేరాఫ్ గా మారుతోంది.

# కర్ణాటక బీజేపీ చీఫ్ చీప్ సూచనలు.. నవ్వుకుంటున్న జనం



కర్ణాటక: కర్ణాటక బీజేపీ చీఫ్ అభివృద్ధిపై దృష్టిపెట్టకుండా చీప్ క్వాలిటీ పనులపై కన్నేయాలని తన పార్టీ కార్యకర్తలకు సూచించాడు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు చాలా చిన్నవని, వాటిపై కాకుండా లవ్ జిహాద్పై దృష్టిసారించాలని బీజేపీ కర్ణాటక చీఫ్ నళిన్ కుమార్ కటీల్ పిలుపునివ్వడం పట్ల నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మంగళూరులో జరిగిన 'బూత్ విజయ్ అభియాన్' కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సీనియర్ నాయకుడు ఇలాంటి చీప్ సూచనలు చేయడంతో అక్కడి జనం నవ్వుకుంటున్నారు.

కార్యకర్తలు లవ్ జిహాద్పై దృష్టి పెట్టి ఎక్కడికక్కడ అణిచివేయాలని కర్ణాటక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్ కార్యకర్తలకు సూచించారు. రోడ్లు, కాలువలు, డ్రెయిన్లు, ఇతర చిన్నచిన్న సమస్యల గురించి మాట్లాడవద్దన్నారు. అలాగే, రాష్ట్రాభివృద్ధి, ఉపాధి, విద్య వంటివన్నీ చిన్న సమస్యలే అని చెప్పారు. వీటన్నింటి కంటే లవ్ జిహాద్పై కన్నేయడమే ముఖ్యమన్నారు.

కటీల్ ప్రసంగానికి సంబంధించిన వీడియోను కర్ణాటక కాంగ్రెస్ సోమవారం ట్విట్టర్లో పోస్ట్ చేసింది. పీఎఫ్ఐపై నిషేధం రాకముందే రాష్ట్రంలో అల్లర్లు జరుగుతున్నాయని నళిన్ కుమార్ కటీల్ చెప్పారు. హిందూ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని పీఎఫ్ఐ వరుస హత్యలకు ప్లాన్ చేసిందని ఆరోపించారు. పీఎఫ్ఐని నిషేధించకపోయి ఉంటే ఇవాళ ఈ వేదికపై ఉన్న ఎందరో నేతలను కోల్పోవాల్సి వచ్చేదని చెప్పారు.

# నిస్సహాయ స్థితిలో ఇంటికి వెళ్లిపోయా: ఢిల్లీ కారు హర్రర్ మృతురాలి స్నేహితురాలు

న్యూఢిల్లీ: తాను నిస్సహాయ స్థితిలో తన ఇంటికి వెళ్లినట్లు కారు హర్రర్లో మరణించిన అంజలి స్నేహితురాలు నిధి తెలిపింది. తన స్నేహితురాలు కారు కింద పడి ఇరుక్కున్న సంగతి డ్రైవర్కు తెలిసినప్పటికీ కారును ఆపకుండా ఆమెను ఈడ్చికెళ్లినట్లు ఆరోపించింది. దేశ రాజధాని ఢిల్లీలో న్యూఇయర్ రోజున 20 ఏళ్ల అంజలి సింగ్ నడుపుతున్న స్కూటీ వెనుక ఆమె స్నేహితురాలు నిధి కూర్చొని ఉంది. కారు ప్రమాదానికి ముందు వారిద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. కాగా, అంజలి నడుపుతున్న స్కూటీని కారు ఢీకొట్టగా కారు కింద అంజలి, మరోవైపు నిధి పడ్డారు. అయితే కారు ముందు చక్రం భాగంలో అంజలి కాళ్లు ఇరుక్కోవడంతో సుమారు 13 కిలోమీటర్ల వరకు ఆమెను రోడ్డుపై ఈడ్చుకెళ్లారు.

దీనిని చూసిన కొందరితోపాటు, నగ్నంగా మృతదేహం రోడ్డుపై పడి ఉండటాన్ని గమనించిన మరి కొందరు కూడా పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్కూటీ ప్రమాదంలో మరోవైపు పడిన అంజలి స్నేహితురాలు నిధి కూడా దీనిని చూసింది. అయితే ఏమీ పట్టనట్లుగా అక్కడి నుంచి తన ఇంటికి వెళ్లిపోయింది.అయితే ఈ ప్రమాదంతో భయపడిన తాను నిస్సహాయస్థితిలో తన ఇంటికి వెళ్లినట్లు మీడియాకు నిధి తెలిపింది. తాను ఇంటికి వెళ్లిన తర్వాత ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదని, చాలా ఏడ్చానని చెప్పింది.

కారు కింద అంజలి చిక్కుకున్న విషయం అందులో ఉన్న వారికి తెలుసని అన్నది. వారు రెండు సార్లు కారును వెనక్కి ముందుకు నడిపారని, ఆ తర్వాత ఆమెను ఈడ్చుకెళ్లారని వెల్లడించింది. దీంతో ఏమి చేయాలో తెలియని నిస్సహాయ స్థితిలో తన ఇంటికి వెళ్లిపోయినట్లు నిధి వివరించింది.

## మొబైల్ ఫోన్ వాడకమే రష్యా సైనికుల కొంప ముంచిందా?



రష్యా : 2022 ఫిబ్రవరిలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ పై వార్ ప్రకటించారు. నాటి నుంచి యుద్ధం నిరాటంకంగా కొనసాగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ యుద్ధం కారణంగా ఇరు దేశాల్లో భారీ ఆస్తి నష్టం.. ప్రాణ నష్టం సంభిస్తోంది. అమాయక ప్రజలు ప్రాణాలను కోల్పోతుండటం శోచనీయంగా మారింది. అయినప్పటికీ ఇరుదేశాలు మొండిగానే యుద్ధాన్ని కొనసాగిస్తుండటంతో ఇప్పట్లో వార్ కు ఎండ్ కార్డు పడే అవకాశం కనిపించడం లేదు. రష్యా-ఉక్రెయిన్ వార్ లో తొలుత రష్యాదే పైచేయిగా కన్పించింది. ఉక్రెయిన్ లోని పలు నగరాలను రష్యా ఆధీనంలోకి తెచ్చుకుంది. అయితే ఉక్రెయిన్ సైతం ధీటుగా జవాబిస్తూ తమ నగరాలను రష్యా నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంటున్నాయి. ఈక్రమంలోనే ఇరు దేశాల సైనికుల మధ్య భీకర యుద్ధం నడుస్తోంది. కీవ్ నగరంతో సహా పలు కీలక నగరాలన్నీ బాంబు మోతలు.. క్షిపణుల పేలుళ్లతో దద్దరిల్లి పోతున్నాయి.

ఉక్రెయిన్ కు నాటో దేశాలు.. అమెరికా పరోక్షంగా సహకారం అందిస్తుండటంతోనే కొన్ని నెలలుగా ఉక్రెయిన్ యద్దం కొనసాగిస్తుందని అర్థమవుతోంది. ఈక్రమంలోనే ఉక్రెయిన్ నుంచి రష్యాకు ఇటీవలి కాలంలో ఎదురుదెబ్బలు భారీగానే తగులుతున్నాయి. జనవరి 1న తూర్పు డొనెట్స్క్ ప్రాంతంలో రష్యన్ సైనికులపై ఉక్రెయిన్ క్షిపణి దాడి చేసింది. ఈ దాడిలో రష్యాకు చెందిన సైనికులు భారీగా ప్రాణాలను కోల్పోయారు. ఈ ఘటనపై రష్యన్లు సోషల్ మీడియాలో ప్రభుత్వం తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉదయం ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక వీడియోను రిలీజు చేసింది. మకివ్కాలో రష్యా సైనికులు బస చేసిన వొకేషనల్ కాలేజీపై ఉక్రెయిన్ నాలుగు క్షిపణులను ప్రయోగించిందని దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆయుధాల పరిధిలో సైనికులు మొబైల్స్ వాడటం నిషేధమని తెలిపారు. అయితే నూతన సంవత్సర సందర్భంగా సైనికులు ఈ నిబంధనను ఉల్లంఘించినట్లు గుర్తించారు. ఈ కారణంగానే శత్రువులు మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా తమ సైనికుల లోకేషన్ ను గుర్తించి క్షిపణితో దాడి చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో 89 మంది సైనికులు మృతి చెందినట్లు రష్యా లెఫ్టినెంట్ జనరల్ సెర్గీ సెవ్యుకోవ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని ఆయన తెలిపారు. చనిపోయిన సైనికులంతా రిజ్వరిస్టులేనని.. ఇటీవలే వారంతా సైన్యంలో చేరి యుద్ధంలో పాల్గొన్నారని వెల్లడించారు.

కాగా కొత్త సంవత్సర వేడుకలను పురస్కరించుకొని రష్యా అధ్యక్షుడు పుతిన్ జాతిని ఉద్దేశించి ప్రసంగించిన కొద్దిసేపటికే ఉక్రెయిన్ దాడిలో రష్యా సైనికులు భారీగా చనిపోయాడు. ఈ ఘటనలో 400 మంది రష్యా సైనికులు మృతిచెందగా.. 300మందికి గాయాలైనట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. అయితే రష్యా మాత్రం 89మంది సైనికులు మృతి చెందినట్లు త్భాజాగా ధృవీకరించింది.

ఇక ఈ దాడి కోసం ఉక్రెయిన్ అమెరికాకు చెందిన హిమార్స్ రాకెట్లను వాడింది. ఈ రాకెట్లు అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను చేరుకుంటాయనే పేరుంది. ఈ దాడి తర్వాత రష్యా కీవ్ పై ప్రతీకార దాడులను ముమ్మరం చేసింది.


## తమపై ఆంక్షలు విధిస్తే ప్రతీకారం తప్పదంటున్న చైనా..!



చైనా: చైనాలో మరోసారి కోవిడ్ కేసులు కలకలం రేపుతున్నాయి. ఒమ్రికాన్.. బీఎఫ్ 7 వేరియంట్ సహా మరో రెండు కొత్త వేరియంట్లు చైనాలో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. దీనికి తోడు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ఆ దేశంలో జీరో కోవిడ్ విధానాన్ని ఎత్తివేశారు. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా కరోనా పాజిటివ్ కేసులు లక్షల్లో నమోదవుతున్నాయి. చైనాలో వ్యాక్సినేషన్ ప్రక్రియ సరిగా చేయకపోవడం వల్లే ప్రజలు మళ్లీ కోవిడ్ బారిన పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏప్రిల్ నాటికి చైనాలో సుమారు 10 లక్షల మంది కోవిడ్ తో మృతిచెందే అవకాశం ఉందని ఇటీవల అమెరికా ఒక నివేదికలో ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే అన్ని దేశాలు చైనా పట్ల అప్రమత్తం అవుతున్నాయి. దీనిలో భాగంగానే చైనా నుంచి ఇతర దేశాలకు వెళ్లే ప్రయాణికులపై ఆంక్షలు విధిస్తున్నాయి. చైనాతో సరిహద్దు పంచుకుంటున్న దేశాలతో పాటు ఇతర దేశాలన్ని చైనీయులు తమ దేశంలో అడుగు పెట్టాలంటే తప్పనిసరి కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. కొన్ని దేశాలు వారిని క్వారంటైన్ చేస్తున్నాయి. అయితే ఈ నిర్ణయాన్ని చైనా మాత్రం తప్పు పడుతోంది.

కొన్ని విదేశీ శక్తులు చైనీయులను కావాలనే బాదానం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. ఇందులో కుట్ర కోణం ఉందంటూ పరోక్షంగా అమెరికాపై విమర్శలు గుప్పిస్తోంది. రాజకీయాలకు ప్రేరిపితమే తమ దేశంపై కొన్ని దేశాలు ఆంక్షలు విధిస్తున్నాయని మండిపడింది. అంతేకాకుండా తమపై ఆంక్షలు విధించే వారిపై ప్రతీకారం తప్పదంటూ హెచ్చరికలు జారీ చేస్తుంది. కాగా చైనా నుంచి వచ్చే ప్రయాణికులపై ఆంక్షలు విధించిన దేశాల్లో ఇండియాతో పాటు అమెరికా.. యూకే దేశాలు ఉన్నాయి. కరోనాను కట్టడి చేసే క్రమంలో ఈ దేశాలు చైనాకు చెందిన విదేశీయులపై ఆంక్షలు విధిస్తున్నట్లు చెబుతున్నాయి. అయితే చైనా మాత్రం మరోలా ఆరోపణలు చేస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈ దేశాలు చైనా ఆరోపణలపై ఎలా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# అమెరికాలో రాజుకుంటున్న 'వేడి'..!




అమెరికా : అమెరికాలో ఒకవైపు మంచు తుఫానులో ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు మాత్రం రాజకీయాలు హీట్ పుట్టించేలా మారుతున్నాయి. అమెరికా గత అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ పై స్వల్ప మెజార్టీతో జో బైడెన్ విజయం సాధించారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య జో బైడెన్ అమెరికా అధ్యక్ష పదవీని చేపట్టిన సంగతి అందరికీ తెలిసిందే. ఇక డొనాల్డ్ ట్రంప్ ఓటమి తర్వాత రిపబ్లికన్లు కాస్తా డీలా పడిపోయారు. రెండేళ్లుగా స్తబ్దుగా ఉంటున్న రిపబ్లికన్లు ఇప్పుడు పార్లమెంటులో కీలకమైన ప్రతినిధుల సభలో మెజార్టీని దక్కించుకున్నారు. ఇటీవల జరిగిన మద్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్ల కంటే ఎక్కువ స్థానాలు రిపబ్లికన్లు సాధించారు. దీంతో ప్రతినిధుల సభలో మంగళవారం నుంచి రిపబ్లికన్లు మెజార్టీతో కొత్త సభ కొలువుదీరింది. ఈ నేపథ్యంలోనే రెండేళ్లుగా ఏకపక్షంగా సాగుతున్న అమెరికా రాజకీయాలు కొత్త మలుపు తీసుకోబోతున్నాయి. డెమొక్రాట్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వ బిల్లులు.. చట్టాలను అడ్డుకోవడంతో పాటు ప్రెసిడెంట్ బైడెన్ నిర్ణయాలు.. ఆయన కుటుంబ సభ్యుల కార్యకలాపాలపై విచారణకు రిపబ్లికన్లు డిమాండ్లు చేస్తుండటంతో అమెరికాలో రాజకీయ వేడి రాజుకుంటుంటోంది. 2024లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగబోతున్న నేపథ్యంలో రిపబ్లికన్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. దీంతో రాబోయే రెండేళ్లలో జో బైడెన్ తీసుకోబోయే అనేక నిర్ణయాలపై పీటముడి పడే అవకాశం కన్పిస్తోంది. బైడెన్ యంత్రాంగ వ్యవహారాలు.. ఆయన కుమారుడు హంటర్ బైడెన్ వ్యాపార కార్యకలాపాలు.. ఉక్రెయిన్ సంబంధాలు వంటి అంశాలు ప్రతినిధుల సభలో చర్చకు రానున్నాయి. ఈ నేపథ్యంలోనే బైడెన్ పై అభిశంసన ప్రవేశ పెడుతామని కొంతమంది రిపబ్లికన్లు ఇప్పటికే ప్రకటించారు. రష్యా-ఉక్రెయిన్ వార్ లో అమెరికా జెలన్ స్కీకి చేస్తున్న సాయం నిలిపివేసేలా రిపబ్లికన్లు ఆలోచిస్తున్నారు. రష్యాతో యుద్ధం చేస్తున్న ఉక్రెయిన్ కు అమెరికా విచక్షణ రహితంగా సాయం చేస్తుందని రిపబ్లికన్లు ఆరోపిస్తున్నారు. అమెరిక్లను మాంద్యంలోకి నెడుతూ ఉక్రెయిన్ ఖాళీ చెక్కులపై సంతకాలు పెట్టి ఇవ్వడం మూర?త్వమని వాదిస్తున్నారు. ఈ అంశాన్ని మధ్యంతర ఎన్నికల ముందు ప్రచారంగా రిపబ్లికన్లు వాడుకున్నారు. ఉక్రెయిన్ తోపాటు విదేశాలకు అమెరికా చేస్తున్న ఆర్థికసాయంపై విచారణ జరుపుతామంటూ రిపబ్లికన్ నేతలు హెచ్చరిస్తున్నారు.

ప్రతినిధుల సభలో మెజారిటీ సాధించి జోష్ లో ఉన్న ట్రంప్ బృందం రాబోయే రెండేళ్లలో బైడెన్ కు ముక్కుతాడు వేయాలని భావిస్తున్నారు. అయితే రిపబ్లికన్ పార్టీలోనూ ట్రంప్ ను సమర్థించే వారు.. వ్యతిరేకించేవారు ఉండటంతో ఆయనతో కలిసొచ్చే అంశాలపైనే ఈ రాజకీయం ఆధారపడి ఉండనుందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రపంచం గ్లోబల్ విలేజేస్‌గా మారిపోతుందా..!

అమెరికా : ఇంటర్నెట్ ఆవిర్భావం తర్వాత మనిషి జీవన విధానం చాలా వరకు సులువైంది. ఇక స్మార్ట్ ఫోన్ అందరికీ అందుబాటులోకి రావడంతో పాటు కారుచౌకగా డాటా ప్యాకేజీలు లభ్యమవుతుండంతో యావత్ ప్రపంచం అరచేతిలోనే ఇమిడిపోయింది. ఫోన్లో ఒక్క బటన్ నొక్కితే చాలు కాలు కదపకుండానే పనులన్నీ క్షణాల్లో జరిగిపోతున్నాయి.



ఇలాంటి సమయంలోనే కరోనా ఎంట్రీ ఇవ్వడంతో ఉద్యోగాల స్వరూపమే మారిపోయింది. కరోనా ముందుకు చాలా మంది ఉదయాన్నే లేచి.. రెడీ అయి.. టిఫిన్ చేసి.. బస్సో.. కారో పట్టుకొని పొలోమంటూ ఆఫీసుకు వెళ్లిపోయేవారు. తిరిగి సాయంత్రం అదే కారో.. బస్సో పట్టుకొని ఇంటికి చేరుకునేవారు. రాత్రి ఫ్యామిలీతో కొంత సమయం గడిపి తిరిగి పొద్దున మళ్లీ అదే పని రోటిన్ గా చేసేవారు.

అయితే కరోనా పరిస్థితుల నేపథ్యంలో కార్యాలయాన్నీ మూతపడ్డాయి. దీంతో ఉద్యోగులను కంపెనీలు వర్క్ ఫ్రమ్ హెూమ్ చేసుకునేందుకు అవకాశం కల్పించాయి. దీంతో ఉద్యోగులంతా తమ తమ గ్రామాల్లోని ఇంటి నుంచి స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ ఉద్యోగాలు చేసుకునే అవకాశం లభించింది. ఈ అవకాశాన్ని వారంతా సద్వినియోగం చేసుకున్నారు.

భారత్ అన్ని దేశాలు కరోనా సమయంలో ఈ విధానాన్ని ఎంతగానో ప్రోత్సహించాయి. ఆ తర్వాత కరోనా కేసులు తగ్గుముఖం పట్టడంతో ఉద్యోగులంతా తిరిగి కార్యాలయాల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అయితే అమెరికాలోని పలు నగరాలు తిరిగి ఖాళీ అవుతున్నాయి. ఉద్యోగులంతా ఇంటి నుంచే రిమోట్ సెన్సింగ్ విధానంలో పని చేస్తుండడంతో ఈ పరిస్థితి వచ్చింది. పార్టనర్ షిప్ ఫర్ న్యూయార్క్ సిటీ అనే సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారంగా వారంలో కొన్ని రోజులైన రిమోట్ వర్క్ విధానం అమల్లో ఉండనుంది. అంటే ఆఫీసుకు వెళ్లకుండా పని చేసే విధానం. రాబోయే రోజుల్లో ఇది కొనసాగుతోందని పేర్కొంది. కరోనా కారణంగా గత రెండేళ్లలో న్యూయార్క్లోని మన్హాటన్ దీవిలో నివసించే జనంలో ఎక్కువమంది ఇతర నగరాలు.. రాష్ట్రాల్లో ఇళ్లు.. అపార్ట్మెంట్ల కోసం వెదుకుతున్నారు.

2020 మార్చి నాటికి ఇలాంటి వారి సంఖ్య 2 లక్షలుగా ఉంది. న్యూయార్క్ లోని క్వీన్స్.. బ్రూక్లిన్ కౌంటీల నుంచి చాలామంది బయటకు వెళ్లిపోయారు. క్వీన్స్ కౌంటీ నుంచి 51 వేల మంది.. బ్రూక్లిన్ కౌంటీ నుంచి 88 వేల మంది వేరే చోటుకు తరలి పోయినట్లు తెలుస్తోంది. వీరంతా కూడా తమ ఇళ్ల నుంచి రిమోట్ వర్క్ విధానంలో పని చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. దీని ప్రభావంతో న్యూయార్క్ నగర జనాభా తగ్గిపోవటం.. పన్ను ఆదాయం పడిపోవటం.. వ్యాపారాలు తరలిపోతున్నాయి.

ఉద్యోగులంతా ఇంటి నుంచే వర్క్ ఫ్రమ్ హెూం.. రిమోట్ విధానంలో పని చేస్తుండడంతో న్యూయార్క్ కు ప్రతి రోజు ఆఫీసుకు వచ్చే వారి సంఖ్య 8 శాతానికి పడిపోయింది. గత సెప్టెంబర్లో నిర్వహించిన సర్వే ప్రకారం 16 శాతం మంది వర్క్ ఫ్రమ్ హెూమ్ కొనసాగిస్తుండగా.. కేవలం 9 శాతం మంది మాత్రమే ప్రతి రోజు ఆఫీసుకు ప్రయాణిస్తున్నారని వెల్లడైంది.

ఫలితంగా చాలా ఆఫీసులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యాపార సంస్థలు.. నగర నివాసుల నుంచి పన్ను ఎగవేత సమస్య తలెత్తుతోంది. ఈ మేరకు న్యూయార్క్ నగరంలోని కొన్ని ఆఫీస్ కార్యాలయాలు నివాస కేంద్రాలుగా మారుతున్నాయి. దీని వల్ల వ్యాపారాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా కరోనా ఎఫెక్ట్ ఉద్యోగులకు మాత్రం ఉన్నచోటే కొత్త అవకాశాలు కల్పించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# విద్యపై ఫోకస్ పెంచిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్..!



బ్రిటన్ : బ్రిటన్లో జరిగిన గత సార్వత్రిక ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే ఆర్థిక మాంద్యం ఎఫెక్ట్ తో ఏకంగా ముగ్గురు ప్రధానులు మారారు. ఈ క్రమంలోనే కన్జర్వేటివ్ పార్టీ నుంచి ప్రవాసీ భారతీయుడు రిషి సునాక్ ప్రధాని రేసులో నిలిచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బ్రిటన్ ను గొప్పగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రిషి సునాక్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే బ్రిటన్లో పలు సంస్కరణలు చేపడుతున్నారు.

భారత్ తో సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న రిషి సునాక్ ఆ మేరకు భారతీయులకు వీసాల విషయంలో పలు సడలింపులు ఇచ్చారు. చైనా.. అమెరికా తదితర దేశాల్లో కరోనా ఎఫెక్ట్ ఎక్కువగా ఉండటంతో భారతీయులు సైతం బ్రిటన్ వైపు మొగ్గు చూపుతున్నారు. బ్రిటన్లో ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు ఉద్యోగాల కోసం అక్కడికి వెళ్లేందుకు ఆసక్తిని చూపుతున్నారు. బ్రిటన్ ప్రధానిగా రిషి సునాక్ బాధ్యతలు చేపట్టగా ద్రవ్యోల్బణం.. వైద్య సేవల్లో సంక్షోభం.. జీతాలు పెంచాలని సిబ్బంది సమ్మె దిగడం వంటి సమస్యలు చుట్టుముట్టాయి. ద్రవ్యోల్బణం కట్టడిపై రిషి సునాక్ దృష్టి సారిస్తూనే దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే కొత్త ఏడాదిలో రిషి సునాక్ జాతిని ఉద్దేశించి ప్రసంగించేందుకు రెడీ అవుతున్నారు.

అయితే ఆ ప్రసంగానికి సంబంధించిన కొన్ని వివరాలు ఇప్పటికే బయటికి వచ్చాయి. 'ఇది నా అనుభవపూర్వకంగా గ్రహించాను.. జీవితంలో నేను పొందిన ప్రతి అవకాశం విద్య వల్లనే లభించింది.. అందుకు నేను అదృష్టవంతుడను.. ప్రతి చిన్నారి అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు నేను రాజకీయాల్లోకి వచ్చాను.. సరైన ప్రణాళికలతో దీనిని అందించాలనుకుంటున్నాను' అని ఆ ప్రసంగంలో పేర్కొనబడింది.

ప్రస్తుతం బ్రిటన్ 16 నుంచి 19 ఏళ్ళ లోపు మధ్య వయస్సున్న వారిలో సగానికి పైగా యువత గణితాన్ని పాఠ్యాంశంగా ఎంచుకోవడం లేదు. భవిష్యత్తులో ఉద్యోగాలకు అనలిటికల్ నైపుణ్యాలు తప్పనిసరి కానున్నాయి. ఈ నైపుణ్యాలు లేకుండా వారిని బయటికి పంపించడం వల్ల వారికి నిరాశే ఎదురవుతుందని రిషి సునాక్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మెరుగైన బ్రిటన్ కోసం 18 ఏళ్ల వయస్సులోని ఉన్న విద్యార్థులంతా గణితాన్ని ఎంచుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. అలాగే యువకులు దేశంలోని ద్రవ్యోల్బణం.. ఇంధన బిల్లులు.. వైద్య సేవల సంక్షోభంపై ఆందోళనకు గురి కావద్దని చెబుతున్నారు. మెరుగైన విద్య అక్రమ వలసల సమస్యకు చెక్ పెడుతుందని రిషి సునాక్ భావిస్తున్నారు. ఇదిలా ఉంటే కన్జర్వేటివ్ పార్టీ నుంచి ముగ్గురు ప్రధానులు మారినా దేశంలో ఆర్థిక పరిస్థితి.. ఇంధన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజల్లో ఆ పార్టీపై వ్యతిరేకత మొదలైంది.

# బంగారం ధరలు

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | 50,200 | 46000 |
| ముంబయి | 46200 | 50400 |
| న్యూఢిల్లీ | 46350 | 57,820.00 |



# వ్యాపారం

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 630కిపైగా పాయింట్లు పతనమైన సెన్సెక్స్



రెండురోజుల పాటు లాభాల్లో కొనసాగిన దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 636.75 పాయింట్లు పతనమై.. 60,657.45 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 189.50 తగ్గి.. 18,043 వద్ద స్థిరపడింది. ఇవాళ్టి ట్రేడింగ్‌లో 1,154 షేర్లు లాభపడగా.. 2,230 షేర్లు క్షీణించాయి. 135 షేర్లలో మార్పు కనిపించలేదు.

నిఫ్టీలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ టాప్ లూజర్స్‌గా నిలిచాయి. దివీస్ ల్యాబ్స్, మారుతీ సుజుకీ, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి. దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు దాదాపు ఒక శాతం చొప్పున క్షీణించాయి.

## కార్ల సేల్స్‌లో ప్రతి రెండోది ఎస్‌యూవీ మోడల్.. 2018 రికార్డులు బ్రేక్




ఆటోమొబైల్ కంపెనీలు 2022లో 37.93 లక్షల కార్లు విక్రయించాయి. గతేడాది కార్ల సేల్స్.. 2018 నాటి రికార్డులను అధిగమించింది. నాలుగేండ్ల క్రితం.. 2018లో 33.8 లక్షల కార్లు అమ్ముడయ్యాయి. 2018తో పోలిస్తే 2022లో 12.21 శాతం, 2021తో పోలిస్తే 23.10 శాతానికి పైగా యూనిట్ల ఎస్‌యూవీ కార్లు విక్రయించాయి ఆటోమొబైల్ సంస్థలు. మొత్తం కార్లలో ఎస్‌యూవీల వాటా 45.30 శాతం. అంటే దాదాపు ప్రతి రెండో కస్టమర్.. ఎస్‌యూవీ కారు కొనుగోలు చేశాడని తెలుస్తున్నది.

2021లో సెమీ కండక్టర్ల కొరతతో అలా.. 2022లో ఇలా

2021లో కరోనా మహమ్మారితోపాటు సెమీ కండక్టర్ల కొరత వల్ల కస్టమర్ల డిమాండ్‌కు అనుగుణంగా కార్ల తయారీ కంపెనీలు గిరాకీకి అనుగుణంగా కార్లు సరఫరా చేయలేకపోయాయి. గతేడాది ఆ సమస్య నుంచి ఆటోమొబైల్ సంస్థలు బయట పడ్డాయి. కొవిడ్-19 సంబంధ ఆంక్షల నుంచి అన్ని రకాల ఇండస్ట్రీయల్ సెక్టార్లకు స్వేచ్ఛ లభించింది. 2022లో సర్వీస్ సెక్టార్ పూర్తిగా సేవలు ప్రారంభించింది. ఉపాధి కల్పనతోపాటు ఆదాయం పెరగడంతో కార్ల విక్రయాలు పెరగడానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నది.కార్ల సేల్స్‌తో పోలిస్తే డిసెంబర్‌లో ఎలక్ట్రిక్ టూ వీలర్స్ సేల్స్ 27.88 శాతం తగ్గి 59,554 యూనిట్లకు చేరాయి. గత నవంబర్‌లో 76,162 ఈ-బైక్‌లు అమ్ముడయ్యాయి. ఏప్రిల్-డిసెంబర్ మధ్య సుమారు ఐదు లక్షల ఈ-బైక్‌లు సేల్ అయ్యాయి. వచ్చే మార్చి నాటికి పది లక్షల ఈ-టూ వీలర్స్ విక్రయించాలని నీతి ఆయోగ్ లక్ష్యాలు నిర్దేశించింది. కానీ నిర్దిష్ట కాలంలో అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023 మార్చి నాటికి) లో 10 లక్షల ఈ-టూ-వీలర్స్ విక్రయించాల్సి ఉండగా, 20-30 శాతం సేల్స్ తగ్గే సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఎలక్ట్రిక్ టూ వీలర్స్ విక్రయం తగ్గడానికి కూడా ఒక కారణం ఉన్నట్లు తెలుస్తున్నది.డజన్ ఈ-టూ వీలర్స్ సంస్థలకు రూ.1100 కోట్ల సబ్సిడీ నిలిపివేతఈ-టూ వీలర్స్ తయారీ చేస్తున్న డజన్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం రూ.1,100 కోట్ల సబ్సిడీ నిలిపేసింది. గత రెండు నెలలుగా ఈ-బైక్స్ సేల్స్ తగ్గడానికి ఇదే కారణం అని సొసైటీ ఆఫ్ మాన్యుఫాక్చరర్స్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ డైరెక్టర్ జనరల్ సొహిందర్ గిల్ పేర్కొన్నారు. విద్యుత్ వాహనాల తయారీ ఖర్చులో 40 శాతం వరకు గరిష్టంగా కేంద్రం సబ్సిడీ ఇస్తుంది. ఈ-టూ వీలర్స్‌కు కిలోవాట్ అవర్‌కు రూ.15 వేల చొప్పున సబ్సిడీ లభిస్తుంది. గృహోపకరణాల మాదిరిగా వాడే వస్తువులపై సబ్సిడీ 40 శాతానికి పరిమితం చేసింది. వాహనాల ధరలోనే సబ్సిడీ కూడా ఇమిడి ఉంటుంది. ఈ-టూ వీలర్స్ తయారీ సంస్థలు తాము బైక్స్, స్కూటర్లు తయారు చేసిన పత్రాలు సమర్పించిన 45-90 రోజుల్లో సబ్సిడీ చెల్లిస్తుంది.

## త్వరలో కొత్త సెలక్షన్ కమిటీ..! చైర్మన్‌గా చేతన్ శర్మకే ఛాన్స్..?






భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు త్వరలో సెలక్షన్ కమిటీని ప్రకటించే అవకాశం ఉన్నది. ఇందు కోసం క్రికెట్ అడ్వైజరీ కమిటీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలను ప్రారంభించింది. సమాచారం ప్రకారం.. అజయ్ రాత్రా, అమయ్ ఖుర్సియా, ఎస్ శరత్ తదితర మాజీ ఆటగాళ్లు సెలక్షన్ కమిటీలో చోటుకోసం పోటీపడుతున్నారు. అలాగే సీఏసీ చేతన్ శర్మ, హర్విందర్ సింగ్‌లను సైతం ఇంటర్వ్యూ చేసింది. సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా చేతన్ శర్మను తిరిగి తీసుకోవడం ఖాయమన్నట్లు వార్తలు వస్తున్నాయి.షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులు ప్యానెల్ ముందు ప్రజెంటేషన్ ఇవ్వగా.. ఈ వారంలో బోర్డుకు సీఏసీ సిఫారసులను అందించనున్నారు. సెలక్షన్ కమిటీకి పోటీపడుతున్న అభ్యర్థుల్లో ఈస్ట్‌జోన్‌కు చెందిన మాజీ భారత ఓపెనర్ ఎస్ఎస్‌దాస్ సైతం ఉన్నారు.

సౌత్ జోన్ నుంచి సునీల్ జోషి స్థానంలో తమిళనాడు మాజీ బ్యాట్స్‌మెన్ శరత్ గట్టిపోటీ ఇస్తున్నాడు.

ఇక ఈస్ట్‌జోన్ నుంచి దేబాశిష్ మొహంతి స్థానంలో దాస్‌ను ఎంపికయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తున్నది. దేబాశిష్, శరత్ కలిసి భారత్, ఒడిశా తరఫున క్రికెట్ ఆడారు. మరో వైపు ఖాళీగా ఉన్న వెస్ట్‌జోన్ స్థానాన్ని సైతం భర్తీ చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా గతేడాది చివరలో ఐసీసీ టీ20 వరల్డ్‌లో భారత జట్టు ప్రదర్శనపై ఇటీవల బీసీసీఐ సమీక్షించిన విషయం తెలిసిందే. ఈ భేటీలో చేతన్ శర్మను సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కొనసాగించేందుకు నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి.

ఈ సందర్భంగా ప్రపంచకప్‌కు సంబంధించి రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. పొట్టి కప్‌లో భారత జట్టు పేలవ ప్రదర్శనతో చేతన్ శర్మ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీపై బీసీసీఐ వేటు వేసింది. చివరిసారిగా సెలక్షన్ కమిటీ శ్రీలంకతో జరిగే సిరీస్‌కు జట్టును ఎంపిక చేసింది. భారతజట్టు పాల్గొనే తర్వాతి సిరీస్‌కు ముందు కొత్త సెలక్షన్ కమిటీని ప్రకటించాలని బీసీసీఐ భావిస్తున్నది.

# క్రీడలు

## ముంబైకి పంత్ తరలింపు




న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ స్టార్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించనున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. గాయమైన భాగాలకు సర్జరీ అవసరమైనందున పంత్‌ను ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలిస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా బుధవారం విలేకర్లకు తెలిపాడు. ముంబైలోని అంబానీ దవాఖానలో ప్రముఖ వైద్యుడు దిన్‌షా పర్దివాలా పర్యవేక్షణలో పంత్‌కు శస్త్రచికిత్స అందించనున్నారు. పంత్ సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాడైనందున అతనికి వైద్య చికిత్స అందించే బాధ్యత తమదేనని బోర్డు పేర్కొన్నది.

# హాట్ ఫోజులతో పిచ్చెక్కిస్తున్న రత్తాలు..!



కాంచనమాల కేబుల్ టీవీ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన నీలి కళ్ల సుందరి రాయ్ లక్ష్మి తెలుగులో హీరోయిన్ గా కన్నా సైడ్ రోల్స్ కే ఎక్కువ ప్రాముఖ్యత తెచ్చుకుంది. ఆ తర్వాత ఛాన్స్ లు వస్తున్నాయి కదా అని స్పెషల్ సాంగ్స్ చేస్తూ వచ్చింది. రాయ్ లక్ష్మి స్పెషల్ ఐటం సాంగ్ చేసింది అంటే అది నిజంగానే స్పెషల్ గా ఉండాల్సిందే. తెలుగు తమిళ భాషల్లో నటించి సూపర్ క్రేజ్ తెచ్చుకున్న అమ్మడు అటు బాలీవుడ్ లో కూడా సినిమాలు చేసింది.ఆ తన గ్లామర్ డోస్ పెంచి బీ టౌన్ ఆడియన్స్ ని బుట్టలో వేయాలని అనుకున్న అమ్మడి ప్రయత్నాలు పెద్దగా సక్సెస్ కాలేదు. అయినా సరే అక్కడ సినిమాలు చేయడం మాత్రం ఆపలేదు. హిందీలో వచ్చిన ప్రతి అవకాశాన్ని చేస్తూ అడపాదడపా తెలుగు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ తో అలరిస్తుంది రాయ్ లక్ష్మి. అంతేకాదు తన ఫోటో షూట్స్ తో కూడా ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. ఈ మధ్య సోషల్ మీడియాలో అందాల భామల ఫోటో షూట్స్ కి విపరీతమైన క్రేజ్ ఏర్పడింది.ఈ క్రమంలో రాయ్ లక్ష్మి కి ఈ ఫోటో షూట్స్ మంచి మైలేజ్ వచ్చేలా చేస్తున్నాయి. లేటెస్ట్ గా బీచ్ లో బికినీ షోతో బెంబేలెత్తిస్తోంది రత్తాలు. బ్లూ కలర్ జాకెట్.. బ్లాక్ గాగుల్స్.. తొడలు కనిపించేలా ఒక క్లాత్ చుట్టుకుని అమ్మడు అందాల రచ్చ చేస్తుంది. న్యూ ఇయర్ ఎంజాయ్ మెంట్ లో భాగంగా అమ్మడు ఇలా తన ఫోటో షూట్ తో ప్రేక్షకులను అలరిస్తుంది. దృష్టి పెడితే స్టార్ రేంజ్ కి వెళ్లే మెటీరియల్ ఆమెది కాని అందరికి అన్ని విధాలుగా లక్ కలిసి రాదు కదా. అలా అనుకునే వచ్చిన ఛాన్స్ లనే చేస్తూ ఫ్రీ టైం లో ఇలా ఫోటో షూట్స్ తో టైం పాస్ చేస్తుంది రాయ్ లక్ష్మి. బాలీవుడ్ లో ఎన్ని సినిమాలు చేసినా సౌత్ లోనే ఆమెకు ఎక్కువ ఫాలోయింగ్ ఉంది. తన ఫోటో షూట్స్ తో సౌత్ ఫాలోవర్స్ ని మరింత ఆకట్టుకుంటుంది రాయ్ లక్ష్మి. హిందీలో ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తున్న రాయ్ లక్ష్మి తెలుగు తమిళ భాషల్లో ప్రజెంట్ అవకాశాలు లేవని తెలుస్తుంది.

# సూర్య 42: షూటింగ్ పూర్తవ్వకముందే 100 కోట్లా?



హాలీవుడ్ టాలెంటెడ్ హీరో సూర్య తన 42వ సినిమాతో మొదటిసారిగా పాన్ వరల్డ్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన అనేక రకాల కథనాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ సినిమాకు ప్రముఖ యాక్షన్ డైరెక్టర్ శివ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇంతకు ముందు ఈ దర్శకుడు తెలుగులో గోపీచంద్ తో శౌర్యం శంఖం సినిమాలను తెరకెక్కించాడు. ఇక ఆ తర్వాత ఎక్కువగా తమిళంలోని సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు.తమిళంలో అజిత్ తో అతను వరుసగా సినిమాలు చేసి బాక్స్ ఆఫీస్ వద్ద మంచి సక్సెస్ అందుకున్నాడు. వేదాలం వీరం సినిమాలు ఎలాంటి ఫలితాలను అందుకున్నయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కమర్షియల్ గా ప్రేక్షకులకు ఏం కావాలో తెలిసిన ఈ దర్శకుడు ఇప్పుడు మాత్రం సూర్యతో ఒక డిఫరెంట్ యాక్షన్ అడ్వెంచర్ సినిమాను తెరపైకి తీసుకురాబోతున్నాడు. పునర్జన్మల కాన్సెప్ట్ లో రాసుకున్న ఆ కథలో సూర్య ఒక పవర్ఫుల్ యోధుడిగా కనిపించబోతున్నాడు.అయితే ఆ సినిమాకు ప్రస్తుతం నేషనల్ వైడ్ గా మంచి మార్కెట్ ఏర్పడుతున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా హిందీలో మంచి దిల్ కుదిరినట్లు సమాచారం. ఒక ప్రముఖ నిర్మాత సినిమా హక్కులను భారీ ధరకు కొనుగోలు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. పెన్ స్టూడియోస్ కు చెందిన నిర్మాత జయంతి లాల్ సూర్య 42వ సినిమా గురించి తెలుసుకొని ఇటీవల ఆ చిత్రం నిర్మాతలతో ఒక డీల్ ఫైనల్ చేసినట్లుగా తెలుస్తోంది.హిందీ మార్కెట్ కు సంబంధించిన డిజిటల్ శాటిలైట్ హక్కులతో పాటు థియేట్రికల్ హక్కులను కూడా మొత్తంగా 100 కోట్లకు దక్కించుకున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటివరకు ఏ తమిళ హీరో కూడా ఈ స్థాయిలో అయితే హిందీలో ఇప్పటివరకు 100 కోట్లు టచ్ చేసింది లేదు. ఇక సూర్య సినిమాలకు గతంలో కూడా ఈ రేంజ్ లో బిజినెస్ జరిగిన సందర్భాలు లేవు. ఒక విధంగా ఇది సరికొత్త రికార్డు అని చెప్పవచ్చు.

ఇక ఈ సినిమాలో దిశాపటాని హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే మరి కొంతమంది బాలీవుడ్ ప్రముఖ స్టార్స్ సినిమాలో ముఖ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి లో ఫినిష్ చేసి సమ్మర్ చివరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నారు.

# టాలీవుడ్ నెంబర్ 1 హీరోయిన్ ఎవరు..?



ఏడాదికి పదుల సంఖ్యలో హీరోయిన్స్ ఎంట్రీ ఇస్తున్నా సరే వారికి టాలెంట్ కి తగిన సినిమాలు పడకపోవడం ఒకపక్క. లక్ కలిసి రాకపోవడం మరోపక్క ఇలా ఎంట్రీ ఇచ్చిన 70 శాతం హీరోయిన్స్ ఒకటి రెండు సినిమాలకే కెరీర్ ముగించేస్తున్నారు. ఇక అలా కాకుండా వచ్చిన ఛాన్స్ తో ఆడియన్స్ ని మెప్పించి దర్శకుల దృష్టిలో పడిన వారి విషయానికి వస్తే వారిని మాత్రం వేళ్లతో లెక్క పెట్టాల్సి వస్తుంది. ప్రస్తుతం టాలీవుడ్ లో సూపర్ ఫాం లో ఉన్న హీరోయిన్స్ విషయానికి వస్తే పూజా హెగ్దే రష్మిక పేర్లు మాత్రమే వినిపిస్తాయి. వారి తర్వాతే ఏ హీరోయిన్ కి అయినా ఛాన్స్ అన్నట్టు ఉంది. అయితే వీరిద్దరు కేవలం తెలుగు సినిమాలే కాకుండా హిందీ తమిళ సినిమాలు చేస్తుండటంతో టాలీవుడ్ నెంబర్ 1 కి ఛాన్స్ లేకుండా పోయింది. ఇక ఉప్పెనతో హిట్టు కొట్టి వరుసగా అరడజను సినిమాలు చేసిన కృతి శెట్టి కూడా సక్సెస్ ట్రాక్ తప్పింది. మళ్లీ అమ్మడు తిరిగి ఫాం లోకి వస్తేనే కానీ నెంబర్ రేసులో ఉంటుంది.కొన్నాళ్లుగా టాలీవుడ్ నెంబర్ 1 పొజిషన్ లో ఉంటూ వచ్చిన సమంత కూడా తన పర్సనల్ లైఫ్ విషయాలతో పాటు గా హెల్త్ ఇష్యూస్ వల్ల రేసులో వెనకపడ్డది. అయినా కూడా తన మార్క్ సినిమాలతో పోటీ ఇస్తుంది సమంత.

అయితే ప్రస్తుతం టాలీవుడ్ లో దూకుడు చూపిస్తున్న హీరోయిన్ ఎవరంటే అది శ్రీ లీల అని చెప్పొచ్చు. కన్నడ పరిశ్రమ నుంచి వచ్చిన అమ్మడు పెళ్లి సందడి తెలుగు ఎంట్రీ ఇచ్చి ధమాకాతో సూపర్ హిట్ కొట్టింది.

రాబోయే రోజుల్లో మరిన్ని ఛాన్స్ లు వెయిటింగ్ లో ఉన్నాయని తెలుస్తుంది. ఈ అవకాశాలన్ని చూస్తుంటే దాదాపుగా శ్రీలీలకే టాలీవుడ్ ఆడియన్స్ టాప్ ప్లేస్ ఇచ్చేలా ఉన్నారు. అమ్మడి దూకుడు కూడా అదే రేంజ్ లో ఉంది కాబట్టి తప్పకుండా శ్రీలీలకు తెలుగులో మంచి క్రేజ్ వచ్చే ఛాన్స్ ఉంది. ఇక అనుపమ నేహా శెట్టి మృణాల్ ఠాకూర్ లు కూడా ఆడియన్స్ ని మెప్పించే ప్రయత్నంలో ఉన్నారు. రీసెంట్ గా వాల్తేరు వీరయ్య వీర సింహా రెడ్డి సినిమాలతో శృతి హాసన్ కూడా తిరిగి రేసులోకి వచ్చింది. వీరందరిని దాటుకుని టాలీవుడ్ నెంబర్ 1 స్థానం ఎవరు దక్కించుకుంటారో చూడాలి.



# ఏంజెల్ ఫారియా.. బ్యూటీఫుల్ షో!

కొంతమంది హీరోయిన్స్ దురదృష్టం ఏమిటో కానీ మొదటి సినిమాతోనే బాక్స్ ఆఫీస్ వద్ద భారీ స్థాయిలో విజయాన్ని అందుకుంటారు కానీ ఆ తర్వాత మళ్లీ మరో అవకాశం కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడుతుంది. జాతి రత్నాలు సినిమా సాధించిన విజయంతో చిట్టిగా మంచి క్రేజ్ అందుకున్న ఫారియా అబ్దుల్లా తప్పకుండా ఇండస్ట్రీలో నిలదొక్కుకుంటుంది అని అందరూ అనుకున్నారు. కానీ ఈ బ్యూటీ బ్యాడ్ లక్ ఏమిటో గాని ఇంతవరకు సరైన అవకాశం దొరకలేదు.మొన్న ఆ మధ్యలో లైక్ షేర్ సబ్ స్క్రైబ్ అనే ఒక సినిమా చేసింది కానీ అదేమీ అది దారుణంగా డిజాస్టర్ అయింది. అంతేకాకుండా మంచు విష్ణు సినిమాలో కూడా నటించబోతోంది అని శ్రీను వైట్ల దర్శకత్వంలో ఢీ సీక్వెల్ రాబోతుంది అని టాక్ వచ్చిన విషయం తెలిసిందే. కానీ ఆ సినిమా స్క్రిప్ట్ దశలోనే ఆగిపోవడంతో మళ్లీ బ్యూటీ మీడియం రేంజ్ హీరోల తో నటించడానికి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇక గ్లామర్ ప్రెసెంటేషన్లో మాత్రం ఫారియా ఎప్పటికప్పుడు తనను తాను సరికొత్తగా ప్రజెంట్ చేసుకుంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో ఇటీవల కాలంలో ఈ బ్యూటీకి మంచి క్రేజ్ అయితే దక్కుతోంది.ఎందుకంటే విభిన్నంగా గ్లామర్ హైలెట్ అయ్యేలా ఫోటోషూట్స్ నిర్వహిస్తోంది. రీసెంట్ గా అమ్మడు వైట్ డ్రెస్ లో ఒక ఏంజెల్ లా స్టిల్స్ ఇచ్చే ప్రయత్నం చేసింది.అందులో మరి వల్గర్ గా లేకుండా చాలా బ్యూటిఫుల్ గా గ్లామర్ ను హైలైట్ చేసింది. ఏదేమైనా కూడా ఈ బ్యూటీ మాత్రం చాలా అందంగా ఉంది అని మంచి సినిమా తగిలితే స్టార్ హీరోయిన్ అయ్యే అవకాశం ఉంది అని మరికొందరు పాజిటివ్ గా స్పందిస్తున్నారు.ఇక ఫారియా అబ్దుల్లా ప్రస్తుతం తమిళం తెలుగులో ఒక లేడీ ఓరియంటెడ్ సినిమా చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అలాగే టాలీవుడ్ లో కూడా రెండు ప్రాజెక్టులు చర్చలు దశలో ఉన్నట్లు సమాచారం.

Printed, published & owned by k. Srinivasa Rao . Printed at Sri balaji printing press H.No. 4-4-85,Thilak Road, KARIMNAGAR -505001(AP) Published at H.No. 1-95/2,MUPPIRITHOTA(V),ELIGAIDU(M), KARIMNAGAR DIST-505525.AP RNI NO. APTEL/2010/35251 EDITOR : K.Srinivasa Rao CELL : 9494494498